సెప్టెంబరు 2021
రు. 20/-

# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక



వినాయకచవితి శుభాకాంక్షలు


TOYOTA
KATHUNIYA
INDIA
TOYOTA
PRAVEEN KUMAR




వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**


# చైతన్యం

సంకల్ప బలం


సామాజిక విలువల మాస పత్రిక

సెప్టెంబరు 2021

సంపుటి -10 సంచిక - 12


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| హితోక్తులు | 6 |
| ఆ ఊరి బడి | 7 |
| వేదులాన్వయు పలుకు | 12 |
| పూరీ జగన్నాథస్వామి వైభవం | 13 |
| సప్త మోక్ష నగరాలు | 18 |
| 116 కందాల్లో సుందరకాండ | 23 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 25 |
| ప్రేమంటే ఇంతే | 28 |
| స్వతంత్ర భారతంలో మహిళా సాధికారత | 30 |
| నవవిధ భక్తులు | 34 |
| స్వాతంత్ర ఉద్యమ విస్ఫూర్తి-చిలకమర్తి | 36 |
| మా ఊరి నందుల కథ | 40 |
| క్రాస్ వర్డ్ పజిల్ కథా కమామీషు | 42 |
| మనన చెన్నప్ప | 45 |
| మన తెలుగు సామెతలు | 49 |


వెనుక కవరు : పారాలింపిక్స్ బంగారు పతక విజేతలు

లోపలి కవర్లు : పారాలింపిక్స్ వెండి,కాంస్య పతక విజేతలు

CoverPhoto by Bhumil Chheda on Unsplash


రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## వినాయక చవితి శుభాకాంక్షలు

చైతన్యం సంకల్పబలం పాఠకులకు వినాయక చవితి" శుభాకాంక్షలు. ప్రజలంతా వినాయకునికి పూజ చేసి, తాము చేసే ప్రతీ పనిని విఘ్నాలు లేకుండా చూడాలని భక్తి శ్రద్ధలతో పూజ జరిపించుకోవాలి. అంతే కానీ అక్కరలేని ఆడంబరాలకు పోయి, ఊరిలో హడావిడి చేసి, అసలే ఎన్నో ఇబ్బందులు పడుతున్న ప్రజలంతా జాగ్రత్త పాటించాలి . మనల్ని మనం కాపాడుకోవాలి. దేశంలో కరోనా తో ఎంతో మంది ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కావున ప్రజలంతా గుంపులుగా చేరకుండా జాగ్రత్తలు తీసుకోండి. అసలే 3ర్డ్ వేవ్ అని కంగారు పడుతున్న ప్రజలంతా ప్రభుత్వం విధించిన నియమ నిబంధనలు పాటించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలు

ఉత్తమ ఉపాధ్యాయుల రాష్ట్ర స్థాయి పురస్కారాల కోసం తెలంగాణ ప్రభుత్వం 48 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. వీరికందరికీ ఈ అవార్డులను ఈ నెల 5వ తేదీన ప్రదానం చేశారు.

## ఏపీ లో పోలీసులకు నాలుగు జాతీయ అవార్డులు

ఏపీ పోలీసులకు నాలుగు జాతీయ అవార్డులు జాతీయ స్థాయిలో దక్కాయని డీజీపీ గౌతమ్ సవాంగ్ తెలిపారు. 2019 డిసెంబరు నుండి ఇప్పటివరకూ ఏపీ పోలీస్ శాఖ 130 బహుమతులు కైవసం చేసుకుందని , పాస్ పోర్ట్ జారీ విషయంలో అయితే దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానం దక్కించుకుందని అన్నారు. ఇవన్నీ కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

## తెలంగాణా విద్యాసంస్థలు

తెలంగాణా .... హైదరాబాద్ లోవిద్యా సంస్థలు సెప్టెంబర్ 1 వ తేదీ నుండి తెరుచుకున్నాయి. ప్రత్యక్ష తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు తెరుచుకున్నాయి. కరోనా నేపథ్యంలో విద్యార్థులు మాస్కులు ధరించి, పాఠశాలలకు, కళాశాలలకు విద్యార్థులు హాజరయ్యారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూనే, ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యా సంస్థల యాజమాన్యాలు పాఠశాలలను శుభ్రం చేసి గురుకులాలు మినహా ప్రత్యక్ష తరగతులు నిర్వహిస్తున్నాయి. తెలంగాణా రాష్ట్రంలో మొదటి నుండీ కోవిడ్ నియంత్రణ చర్యలు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంచాలకులు డా. శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటివరకూ రాష్ట్రంలో 1నుంచి 10 ఏళ్ల లోపు వారిలో కేవలం 3 శాతం మాత్రమే, అలాగే 20 ఏళ్ల లోపు వారిలో 13 శాతం మందికి మాత్రమే వైరస్ సోకినట్లు వెల్లడించారు వైరస్ సోకినా వాళ్ళల్లో 73 శాతం మంది 20 నుంచి 65 ఏళ్ల లోపు వారు ఉన్నట్లు వివరించారు. చిన్నారులకు కోవిడ్ సోకినా 100 శాతం మంది కోలుకుంటున్నారని తెలిపారు. ఇక అమెరికాలో అయితే డెల్టా వైరస్ ఎక్కువగానే ఉంది. ఈ వైరస్ ఇండియా నుండి వచ్చిందని, అక్కడనుండి వచ్చే భారతీయుల రాకను నిషేధించింది. అమెరికా రావాలనుకునే వారు అమెరికా పౌర సత్వాన్ని కలిగి ఉండాలని నిబంధనలు పెట్టింది. అక్కడ నుండి ఎవరైనా అత్యవసరంగా రావాలనుకునే వారు ఇండియా నుండి డైరెక్ట్ గా కాక, వేరే దేశానికి వెళ్లి 14 రోజులు ఉండి అమెరికాకు వస్తున్నారు. అమెరికాలో వైరస్ ఎక్కువగా ఉండి, ఆసుపత్రులు రోగులతో నిండి, బెడ్స్ ఖాళీ లేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఈ వైరస్ కూడా టెక్సాస్ స్టేట్ లోను ఫ్లోరిడా లోనూ ఎక్కువగా ఉంది ఆగస్టు నెలలో, కానీ ప్రస్తుతం స్టేబుల్ గా ఉంది అమెరికాలో పరిస్థితి అంటున్నారు. కానీ ఇంకా ప్రజలు అప్రమత్తముగా ఉండవలసిందే అని అక్కడ డాక్టర్లు చెబుతున్నారు. మరో పక్క గత 18 నెలలుగా విద్యా సంస్థలు మూత బడి, గత 10, 15 రోజులనుండి తెరుచుకున్నాయి. అమెరికాలో 12 సంవత్సరాల వయస్సు వచ్చిన పిల్లలకు మాత్రమే వేక్సిన్ ఇవ్వడం జరిగింది. అయినా పిల్లలంతా ఒక్కసారి కలవడంతో, ఎంత మాస్కులు ధరించినా, రోజుకి ఒకరిద్దరు కరోనా బారిన పడుతున్నట్లు, తల్లి తండ్రులు మెయిల్ అందుకుంటున్నామంటున్నారు. 12 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలకు ఇంకా వ్యాక్సిన్ అనుమతి లభించ-

లేదు.

ప్రభుత్వం ఉచితంగా వేక్సిన్ ఇచ్చినా ఇంకా అమెరికాలో కొందరు వేక్సిన్ వేయించుకుందుకు ఇష్టపడక వ్యతిరేకిస్తున్నారు . కొందరు అలా ఉండడం వల్ల కూడా మిగిలిన వారు ఇబ్బంది పడుతున్నారని, ఆ వచ్చే కేసులు కూడా వ్యాక్సిన్ వేయించుకోని వారివే ఎక్కువగా ఉంటున్నాయని అమెరికాలోని డాక్టర్లు చెబుతున్నారు. ఏది ఏమైనా కరోనా వైరస్ బారిన పడుతూ ప్రజలు ఇబ్బంది పడుతుంటే, ఇంకా కొత్త వేరియంట్లు పుట్టుకొస్తూనే ఉన్నాయి. యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ తన రూపాలను మార్చుకుంటూ, ఆల్ఫా, డెల్టా లాంటి వేరియంట్లు విజృంభించడంతో, ఆల్ఫా 193 దేశాల్లోనూ, డెల్టా 170 దేశాల్లోనూ కేసులు బయట పడ్డాయి. తీవ్ర ప్రభావం చూపించే వేరియంట్లు వెలుగు చూడడం ఆందోళన కలిగించే అంశం.

టోక్యో లో జరిగిన పేరాలింపిక్స్ లో మన క్రీడాకారులు 19 మెడల్స్ గెలిచి మన దేశానికే గర్వ కారణమయ్యారు. 5 గోల్డ్ మెడల్స్, 8 సిల్వర్ మెడల్స్, 6 బ్రాంజ్ మెడల్స్ గెలిచిన వీరికందరికీ చైతన్యం సంకల్ప బలం అభినందనలు తెలియజేస్తోంది. ప్రధాన మంత్రి స్వయంగా అందరికీ అభినందనలు తెలిపి, క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

తాలిబన్ ప్రభుత్వ అధినేతగా ముల్లా బారాదర్

ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్లు ఆక్రమించుకోవడం, అక్కడ ప్రజలంతా అనేక ఇబ్బందులపాలై విదేశాలకు పరుగులు తీయడం, కొందరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడం జరిగింది. శుక్రవారం ముల్లా బరాదర్ పేరును తాలిబన్ ప్రభుత్వ అధినేతగా ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పటివరకు ఆయన తాలిబన్ ల పొలిటికల్ ఆఫీస్ అధిపతిగా వ్యవహరిస్తూ వచ్చారు. ఇంకా తాలిబన్ల వ్యవస్థాపకుడు ముల్లా ఒమర్ కుమారులు ముల్లా యాకూబ్, షేర్ మహమ్మద్ స్టానెక్జాయ్ లకు కీలక స్థానాలు దక్కనున్నాయి. ట్రంప్ సర్కార్ ఆఫ్ఘన్ లో యుద్ధాన్ని ముగించాలని భావించడంతో తాలిబన్లతో చర్చలకు తెర లేపింది. అమెరికా తాలిబన్ల మధ్య ఒప్పందం ఫిబ్రవరి 29 న కుదిరింది. 2020 మార్చి లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆఫ్ఘనిస్తాన్ లో హింసను ఆపాలని బారాదర్ తో మాట్లాడారు. తరువాత బారాదర్ పేరు ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కి, తాలిబన్ ప్రతినిధిగా వివిధ దేశాల నాయకులతో చర్చలు జరపడం జరిగింది. ఈ మధ్య చైనాను సందర్శించిన తాలిబన్ల బృందానికి కూడా నాయకత్వం వహించారు.ఆఫ్ఘనిస్తాన్ లో మహిళలకు పూర్తిగా హక్కులు లేవని, కాబూల్ లో పలు దుకాణాలపై ఉన్న మహిళా పెయింటింగ్స్ ను తాలిబన్లు బలవంతంగా తొలగించడం లోనే అర్ధమవుతోందని, అక్కడ తమ హక్కుల కోసం పలు చోట్ల రోడ్ల పైకి వచ్చి గొంతెత్తుతున్న మహిళల పట్ల తాలిబన్లు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారని, వీడియోలు , సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. పాశ్చాత్య దేశాల ప్రోత్సాహంతో తమకు లభించిన స్వేచ్ఛ, హక్కులను కాలరాయద్దని కాబూల్ లోని ప్రెసిడెన్షియల్ భవనం వద్ద ఎంతోమంది మహిళలు శుక్రవారం Sep 3న ఆందోళనకు దిగారు.

ఒక పక్క ఆఫ్ఘానిస్తాన్ లో జరుగుతున్న దుశ్చర్యలు, మరో పక్క చైనా, పాకిస్థాన్ ఎటువంటి ఇబ్బందులైనా పెట్టాలని చూస్తుంటే, ఇంకా వదలకుండా పీడిస్తున్న కరోనాతో సమస్యల వలయంలో ప్రజలంతా చిక్కుకున్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో ఇంకా మన దేశంలో ఐకమత్యం కొరవడి, ఒకరి నొకరు విమర్శలతో సమయాన్ని డబ్బును వృధా చెయ్యడం ఎంత వరకు సమంజసం? ఇవన్నీ మనం మానుకుని అంతటా అంతా కలిసిగట్టుగా దేశాన్ని కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజలంతా దేశ భక్తిని పెంచుకోండి.

మనం దేశంలో భాగం మాత్రమే. దేశం బావుంటేనే మనం బావుంటాము.
మనమంతా ఒక్కటే. ఈ దేశం మనది. మన దేశాన్ని మనం కాపాడుకుందాం.



మీ ఎడిటర్,

తీగవరపు శాంతి

# హితోక్తులు

కొత్త రామానందం

**కేయూరాణి న భూషయంతి పురుషం హారాన చంద్రోజ్వలా:**
**న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతం మూర్ధజా:**
**వాణ్యేకా సమలం కరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే**
**క్షీయంతే ఖలు భూషణాని సతతం వాగ్భూషణం భూషణం**

మనిషికి బంగారు ఆభరణాలు, ముత్యాలహారాలు అలంకారం కాదు. పూలమాలలు పరిమళ ద్రవ్యాలు, స్నానాలు ముఖ్యం కాదు. సంస్కారంతో కూడిన మాటలే మనిషికి సిసలైన అలంకారాలు. పైవన్నీ క్షీణించేవే. క్షీణించని మంచి మాటలే సిసలైన ఆభరణం.

**న చోర హార్యం న రాజ హార్యం**
**న భ్రాతు భాజ్యం న చ భారకారీ**
**వ్యయ కృతే వర్ధత ఏవ నిత్యం**
**విద్యాధనం సర్వ ధన ప్రదానం**

విద్యాధనమునకు సమానమైన ధనమే లేదు. విద్యావంతునికి దక్కని గౌరవం ఉండదు. అయితే విద్య అంటే మామూలు చదువు కాదు. 'చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ' అని ప్రహ్లాదుడు చెప్పిన విధముగా బ్రహ్మము తెలిసికొనుటకు, జ్ఞాన సముపార్జన కొరకు సాధన మయ్యేది విద్య. సమాజ హితమునకు ఉపయోగపడాలి అని తపించేవారు కొందరే ఉంటారు. వారి ఉద్దేశ్యము విద్యాధికులము అని చెప్పుకోవడం కాదు. 'విద్యా దదాతి' వినయం అన్నట్లుగా వినయముతో నాకు తెలిసున్న నాలుగు విషయాలు అందరికీ ఉపయోగపడాలి అన్న తపన మాత్రమే.

# ఆ ఊరి బడి



## ఎలెక్ట్రాన్

స్త్రీకి ఆర్థికస్వాతంత్ర్యం ఉంటే భర్త అంతగా ఎదురు చెప్పలేడు. అతను గది వదిలి బయటకు వచ్చి, రెండు లక్షలకి రామలింగం పేరిట చెక్కు రాసి ఇచ్చాడు.

మొత్తం మీద అందిన ధనసహాయంతో, ఊరిలోని ఒక తాపీమేస్త్రి చేసిన శ్రమదానంతో బాలబాలికలకు ముందస్తుగా ఆధునికమైన మరుగు దొడ్లు కట్టించాడు. ఇంటి పైకప్పు పెంకుల వరసలను సరి చేయించి, ఇల్లంతా గోడలకి వెల్లలు, స్తంభాలకి రంగులు వేయించాడు. ప్రాంగణంలో ఉన్న నూతి గట్టుని బాగుచేయించి, పైన జాలీ చట్రం బిగించి, మోటారు పంపు ఏర్పాటు చేసి, పదడుగుల ఎత్తులో రెండు సింటెక్స్ తయారీ నీళ్ళకుండీలను ఒకటి మామూలు వాడకానికి, మరొకటి తాగునీటికి ఏర్పాటు చేశాడు. తాగునీటినుండి సూక్ష్మజీవుల తొలగింపుకు విద్యుత్ పరికరాన్ని అమర్చాడు. పడిపోయిన ప్రహరీ గోడని బాగుచేయించి పిల్లలచేత మొక్కలు నాటించాడు. ఈ పనులనన్నింటినీ పావని దగ్గరుండి అజమాయిషీ చేసింది. అణా, పైసలతో సహా (క్షమించాలి ఆఖరి రూపాయివరకూ)



అయిన ఖర్చులు ధనసహాయం చేసినవారికి చూపించాడు. ఈ మార్పులు చూసి ధనసహాయం చేసినవారు సంతసించి రామలింగం మీద గౌరవాన్నిమరింతగా పెంచుకొన్నారు.

ఆ తర్వాత ఊరి పెద్దలని పిలిచి ఒక కురువృద్ధుచేత సరస్వతీ దేవి చిత్రాన్ని ముందు వసారా గుమ్మం పక్కన ఆవిష్కరింప చేశాడు.

“చుట్టూ ఉన్న వాతావరణం అన్ని వెసులబాట్లతోనూ ఆహ్లాదకరంగా ఉంటే, చేయాల్సిన పనుల్లో ఉత్సుకత ఉంటుంది. విద్యా-



లయమనేది కూడా ఈ రీతికి అనుగుణంగానే ఉండాలి. ఈ బడి చూడముచ్చటగా కనిపించేటందుకు మీరందరూ నడుం బిగించి సహాయం చేశారు. ఆర్థికంగా కామేశం గారి బావమరుదులు, మరి కొందరు పెద్దలు అజ్ఞాతంగా తగుపాటి సహాయం చేశారు. అన్నీ ఉన్నా అయిదోతనం లేనట్టుగా, యిప్పుడు పాఠశాలకు అన్నీ సమకూరినా, ఉపాధ్యాయులే లేకుండా పోయారు. యింతకాలం నుంచీ కొనసాగుతోనేఉన్న ఉపాధ్యాయుల కొరత గురించి ఆలోచించాలి. దీనికి నేను అధికారులకు విన్నపాలు విన్నవించుకొంటా కానీ, రాజకీయంగా పలుకుబడిఉన్న పంచాయితీ అధ్యక్షులు కనకరాజు గారు ముందంజవేసి దస్త్రాలని కదిలిస్తే, పాఠశాల పరుగులు తీస్తుంది. గ్రామమంతా సంఘటితంగా ఎలుగెత్తితేకాని బాధ్యతల్ని విస్మరిస్తూ కప్పదాట్లు వేస్తున్నఈ ఉపాధ్యాయులకీ, లక్ష్యం లేని విద్యాధికారవర్గానికీ చెవికెక్కదు. ఈ సహాయంకోసం ఊరి గ్రామస్థులనీ, గ్రామ పాలకవర్గాన్ని అర్థిస్తున్నాను!” అన్నాడు.

పంచాయితీ అధ్యక్షుడు కనకరాజు ఆకసం కేసి చూస్తూ, “అంతా ఆ పరమేశ్వరుడి దయ! ప్రయత్నిస్తాను!” అన్నాడు. తన ప్రమేయం లేకుండా స్కూలు బాగోగుల్ని చేయించినందుకు ఆయనకి మనసులో గుర్రుగా ఉంది.

కామేశం మేనకోడలు పాఠశాల విద్యార్థులకు ఊరికే చదువు చెప్పడానికి పట్నం నుంచి మకాం మార్చి వచ్చిందని తెలుసుకొన్న ఊరిపెద్దలలో కొంత సంచలనం కలిగింది. ఆ ఊరినుంచి ఇద్దరు సైన్యంలో చేరారు. ఒకతను సూరిబాబు. కాశ్మీరు సరిహద్దులో పాక్ చేసిన దొంగ దాడుల్లో కుడికాలు పోగొట్టుకొని, ఊరు తిరిగివచ్చి తండ్రికి వండ్రంగి పనుల్లో సాయం చేస్తున్నాడు. అతగాడూ ఇంటర్ ప్యాసయిన వ్యక్తి. అతను కూడా పాఠాలు చెప్పడానికి ముందుకు వచ్చాడు. రామలింగం ఆనందానికి హద్దులు లేకపోయింది. ఎందుచేతనంటే శ్యామలరావు వెళ్ళిపోయిన తర్వాత తనొక్కడే అన్ని తరగతుల్లోకి వెళ్ళి, ఓ అరగంట పాఠం చెప్పి, అభ్యాసం చెయ్యమని పాఠాలు ఇచ్చి ఏదో విధంగా బండి నడిపించాడు. ఏడో తరగతిలో ఉన్న మాలక్ష్మి, మంగ అనే ఇద్దరు అమ్మాయిలు ఒకటి, రెండు తరగతులకు పోయి కొన్ని పాఠాలు చెప్ప సాగారు. ఇప్పుడు మరో ఇద్దరి ఆసరా లభించడంతో రామలింగానికి కొండంత ధైర్యం వచ్చింది. మొదట్లో ఓ వారం రోజులు పావని, సూరి బాబుల్ని దగ్గర కూర్చోబెట్టుకొని బోధనా



రీతుల్ని గురించి సూత్రప్రాయంగా వివరించాడు. వారు పాఠం చెప్పడంలో ఉన్న నాడి పట్టుకొన్నారు. మా లక్ష్మి, మంగలు కూడా మరిన్ని సులువులు నేర్చుకొన్నారు. పావని కొడుకు ఒకటో తరగతిలో చేరాడు.

పిల్లల్లో చదువుమీద ఉత్సాహం కలగడం చూసి తల్లిదండ్రులు నిట్టూర్పులు వదిలి, ఆశాభావం వహించ సాగారు.

మధ్యాహ్న భోజన పథకం కొనసాగటల్లేదని, ఎవరో నేరారోపణచేస్తే ఇద్దరు అధికారులు పరుగులమీద వచ్చారు. రామలింగం ఊరివారిని పిలిచి పంచాయితీ పెట్టాడు. "కోనసీమనుంచి నేనీ ఊరొచ్చి ఆరునెలలైంది. భోజనపథకం తాలూకు ఒక్క ఖాతా బుక్కు కూడా లేదు. ఉన్నది నేనొక్క ఉపాధ్యాయుణ్ణి. నలభైమంది విద్యార్థులు. అందరూ ఇళ్లదగ్గరే తిండి తిని వస్తున్నారు. యిప్పుడు మీ దగ్గరున్న ఖాతాల వివరాలు చెప్పండి", అని నిలదీశాడు.

"వందమంది విద్యార్థులు ఉన్నట్టుగా మాకు చూపిస్తే మేము సరుకులూ సరంజామా అందిస్తున్నాం. యిద్దరు వంటవారికి మనిషికి రోజుకి వంద చొప్పున రెండువందలు అందజేస్తున్నాం. అంట్లు తోమే మనిషికి రోజుకు పాతిక రూపాయలు మంజూరు చేస్తున్నాం. యివిగో కాయితాలు సంతకాలతో సహా!" అని దాఖలాలు చూపించారు.

"గత రెండు సంవత్సరాలుగా మా బిడ్డలకి ఒక్క అన్నం మెతుకు కూడా పెట్టలేదు. అయినా మాకు కావాల్సింది పిల్లల చదువుకాని, ఇలా దొంగ లెఖ్ఖలు రాసిన కాయితల మీది కూడు కాదు. ఎంతున్నా, కాని కూడు తినే ధోరణి మీ చదువుకొన్న దొరలదే!" ఎరుకలమ్మి శోమిదేవమ్మ విరుచుకు పడింది. ఒక పత్రికా విలేఖరి కోడైకూశాడు.

జిల్లా పాలనాధికారిచేత అతి తీవ్రమైన చివాట్లు తిన్న విద్యాధికారి యంత్రాంగం కదిలింది. పిలుపందుకోవడంతో రామలింగం వెళ్ళి జిల్లా పాలనాధికారితో మాట్లాడాడు.

"అంటున్నందుకు క్షమించండి. మౌలికంగా ఈ భోజనపథకం వెనుకనున్న ఆశయం పేద విద్యార్థులను చదువుపట్ల సుముఖులను చేయడానికే అయినా, తల్లిదండ్రులు కన్న సంతానాన్ని

విద్యకోసం కాకుండా ఒక పూట భోజనం కోసం పంపిస్తున్నట్టుగా తయారైంది. భోజనం తర్వాత మధ్యాహ్నం తరగతులకు రాక, బాలకార్మికులుగా తల్లిదండ్రుల వెంట పోతున్నారు. భోజన పంక్తుల్లో కుల, మత భేదాలు వివాదాలకు దారి తీసిన సంఘటనలు మీకు తెలియంది కాదు. అలాగే తమకు పెట్టిన తిండిలో కొంత డబ్బాలో దాచుకొని, ఇంటికి తీసుకుపోయి డొక్కలు మాడుతున్న తల్లికి పెట్టే హృదయ విదారకమైన సంగతులు నాకు తెలుసు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనాల ఏర్పాటులో తలమునకలౌతున్నారు. సరుకులు నాసిరకంగా ఉంటున్నాయి. విద్యార్థులు అనేక సందర్భాలలో విషాహారం పాలిటబడి తీవ్రమైన ఆరోగ్యసమస్యలు సృష్టిస్తున్నారు. అవినీతికి విద్యారంగం కూడా అతీతం కాకుండా పోయింది. ఇప్పుడు మా ఊరి బడికి కావాల్సింది మధ్యాహ్నభోజనాలు కాదు. ప్రతి నిత్యమూ పాఠశాలకు హాజరయ్యే బోధకులు కావాలి. యింతవరకూ ఎనిమిదో తరగతి వరకు నామ మాత్రపు పరీక్షలు. నిలవరింపులు లేవు. యిప్పుడు పదో తరగతి వరకూ నిలవరింపులు ఉండవంటున్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి శాతం పడిపోతే మీరే మాకు తాఖీదులిస్తున్నారు. అందు మూలాన ఉపాధ్యాయులే విద్యార్థులకు చీటిలిచ్చేస్తున్నారు. జవాబులు చెప్పేస్తున్నారు. స్థాయి అధఃపాతాళానికి పడిపోతోంది. పద్ధతి మార్పించండి సర్!"

"వారం రోజుల్లో మీ బడిలో ఆరుగురు ఉపాధ్యాయులు వచ్చి చేరేటట్లు చూసే బాధ్యత నాది. మీరు చెప్పిన విషయాలు సత్యదూరం కాదు. ప్రభుత్వ పథకాల్ని అమలు పర్చడమే తప్ప నిరసించే అవకాశం మాకు లేదు. ఎందుకంటే ఆ ప్రణాళికలన్నీ తీసుకొచ్చేది ప్రజలెన్నుకొన్న నాయకులదే! ఇంకా....?"

రామలింగం పావనిని గురించి, సూరిబాబు గురించి, ఏడో తరగతి చదువుతున్న మంగ, మాలక్ష్మిల గురించి చెప్పి, వారి సహాయంతో తను పాఠశాలనెలా నిర్వహిస్తున్నాడో వివరించాడు.

"అయితే ఆ పక్షంలో నలుగురు ఉపాధ్యాయుల్ని పంపిస్తాను. పావని, సూరిబాబుల్ని మీరు కొనసాగించండి. వారిని శాశ్వతంగా మీ పాఠశాలకే అంకితమయ్యే సాధికార చర్యలు తీసుకొంటాను. మధ్యాహ్న భోజన పథకాల్లో చాలా అవకతవకలు జరుగుతున్నాయన్న సంగతి నాకు తెలుసు. ఏం చేద్దామంటారు? రద్దు చేయడం అనేది కుదరదు. ఇది నోటుకూ వోటుకూ ఉన్న సంబంధంలాగే పిల్లవాడి నోటికీ, వాడి తల్లిదండ్రుల వోటుకూ ఉన్న సంబంధం!"

"ఆ ఊరిలో మరిడమ్మ వారనే గ్రామదేవత గుడి ఉంది. ఆ గ్రామదేవతకి ఆగ్రహమెక్కువని ఊరివారికి చాలా నమ్మకం. ఆ ఆలయ నిర్వహణకి ఒక సంఘముంది. వారికి ఈ మధ్యాహ్న భోజన పథక నిర్వహణ అప్పగించి, పావని ఆధ్వర్యంలో సక్రమంగా జరిగేటట్టు చూసే బాధ్యత నాది. ఎటొచ్చీ నాసిరకం సరుకులు అందించ ప్రయత్నిస్తే ఆయా సంబధిత వ్యక్తులను శిక్షించే అధికారం మీరు చేబట్టాలి."

"మీ ఉద్దేశ్యం బాగానే ఉంది. ఏ మార్పుకైనా అడుగువేస్తేనే కానీ ఎదురైయ్యే ప్రతిబంధకాలు, కష్టసుఖాలు తెలియవు. అలాగే కానిద్దాం. ఏ విధమైన అవసరమొచ్చినా మీరు నాకు నేరుగా సమాచారమందించండి."

రామలింగం ధన్యవాదాలు తెలుపుకొని తిరుగు ముఖం పట్టాడు. ఆ వచ్చే సోమవారానికల్లా నలుగురు పంతుళ్ళు వచ్చి చేరారు. రామలింగం అందర్నీ సమావేశ పరచి పాఠ్య ప్రణాళికల్ని చర్చించి విధులు అప్పగించా-

డు. రామలింగం మాటలవెనుక జిల్లాపాలనాధికారి బలముందని తెలిసిన ఉపాధ్యాయులు కాస్త బెదురుతోనే విధినిర్వహణలోకి దిగిపోయారు. ఇద్దరిద్దరు చొప్పున ప్రతిరోజూ రెండు మోటార్ సైకిళ్లమీద పట్నం నుంచి సరిగా సమయానికి వచ్చి, సమయమైన తర్వాత వెళ్లసాగారు. ఓ వారం రోజుల్లో రామలింగం దక్షత చూసి, వారికి ఆయనంటే విపరీతమైన గురి, గౌరవాలు కలిగాయి. ఇక పావని, సూరిబాబుల సంగతి చెప్పనక్కర్లేదు.

ఆఖరి గంట అయిపోయిన తర్వాత అభిరుచి కల విద్యార్థులకు నీతి కథలు బోధించే వాడు. రెండు బీరువాల గ్రంథాలయం ఏర్పాటు చేశాడు. సులభగ్రాహ్యమైన, ఆసక్తికరమైన పుస్తకాలు చదవింపజేశాడు. చదివిన వాటినీ, విన్న వాటిని తిరిగి వారిచేతనే మరుచటి దినాల సాయంత్రాల్లో చెప్పించేవాడు. వారు చూసిన వింతల్నీ విశేషాల్ని చెప్పమనే వాడు. ఆ పిల్లలందరికీ వాక్శుద్ధి ఏర్పడింది. అడగవల్సింది ధైర్యంగా అడుగుతున్నారు, చెప్పవల్సింది చెప్పగల్గుతున్నారు. సభాపిరికిదనం లేకుండా పోయింది. కొందరు పెద్ద పిల్లలు బడి బెంచిలనీ, కుర్చీలను బాగు చేసే సూరిబాబుకి సహాయం చేసేవారు. పావని ఆడపిల్లలకి అల్లికలూ, కుట్టు పనులు నేర్పించసాగింది. రామలింగం నెలకోసారి చెప్పాపెట్టకుండా నెలసరి పరీక్షలు పెట్టి ఒకరి సమాధాన పత్రాల్నిమరొకరిచేత దిద్దించేవాడు. అందరి విద్యార్థుల స్థాయి పెరిగింది.


ఆ మరుసటి సంవత్సరానికల్లా పట్నం పోయి చదువుకొనే పిల్లలు చాలామంది తిరిగి వచ్చి తమ ఊరి బడిలోనే చేరారు. బడిపక్కనే ఉన్న ఒక అరెకరం మెరక భూమిని ఒక రైతు పాఠశాలకి ఇచ్చేశాడు. దాంతో ఒక ఆటస్థలం లభ్యమైంది. సూరిబాబు విద్యార్థులచేత క్రమపద్ధతిలో కవాతు చేయించి ఆటలాడించేవాడు. ఆ మరుచటి సంవత్సరం చుట్టుపక్కలున్న కుగ్రామాలనుంచి కూడా విద్యార్థులు వచ్చి చేరసాగారు. జిల్లాపాలనాధికారి స్వయం కలగచేసుకోవడంతో మూడేళ్లలో అది ఉన్నత పాఠశాలగా మారిపోయింది. ఇరవై మందికి పైగా ఉపాధ్యాయులు. ప్రాంగణంలో ఒక క్రమపద్ధతిలో మరో పదిగదుల నిర్మాణం జరిగింది.

ఇప్పుడు రామలింగం లేడు. పావని లేదు. సూరిబాబు లేడు. అందరూ కాలగర్భంలో కలిసిపోయారు. రామలింగం మాటలు వినక వెళ్ళిపోయిన శ్యామలరావు మధ్యలో ఒకసారి ప్రధానోపాధ్యాయుడిగా ఆ ఊరికి బదిలీ మీద వస్తే, ఊరి ప్రజలు అడ్డుకొని తిరిగి పంపించేశారు. యిప్పుడు మాలక్ష్మి, మంగలు అదే పాఠశాలలో తలనెరిసిన ఉపాధ్యాయినులు. పావని కొడుకు విజ్ఞానశాస్త్రజ్ఞానాన్ని బోధించే ఉపాధ్యాయుడు. ఆ పాఠశాలనుంచి వెళ్ళిన ఎందరో విద్యార్థులు ప్రతిభావంతులైయ్యారు. ప్రహరీ గోడ లోపల చుట్టూతా ఆదిలో రామలింగం పాతించిన వేపమొక్కలు యిప్పుడు దృఢమైన వృక్షాలుగా ఎదిగాయి.

విద్యాలయమనేది నిలకడ నీరున్న చెరువు కాదు. విద్య గంగా ప్రవాహంలాంటిది. ఆ ప్రవాహాన్ని కల్మష రహితంగా ఉంచే బాధ్యత, అధ్యాపకులది, విద్యార్థులది, చదివించే తల్లిదండ్రులది, ముఖ్యంగా ఆ గ్రామస్థులది కూడాను. ఊరి గుడిని ఎంత పవిత్రంగా చూస్తారో ఊరి బడిని కూడా అంతే శ్రద్ధతో చూడాల్సింది గ్రామపెద్దలే!

***

# వేదులాన్వయు పలుకు -9



వేదుల సుబ్రహ్మణ్యం

మదము మోహము నందిన మానవులకు
మనసు విజ్ఞత కోల్పోయి మైలపడును
మనుగడంతయు నిక్కట్ల మయము సేయు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 81

ఇంద్రియమ్ముల నరికట్ట నెవరి తరము
ఎంత సాధన చేకూర్చు నంత ఫలము
మునులు యోగుల కది నిత్య మోక్ష పథము!
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 82

పదవి లేదన్న దిగులును ప్రక్క నెట్టి
ఇష్టమగునట్టి వ్యాపక మెంచి మనుము
బుద్ధి బలమంది మనసుకు పొసగు మేలు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 83

పిల్లలను మంచిగా పెంచి పెరుగునట్లు
వారి యభిరుచి మేరకు వరుస కలిపి
మంచి పౌరులుగా జేయ మాన్యతగును
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 84

తెలుగు భాషను మాటాడ దెలియజేసి
ఒత్తులను పల్కు నీమము లొత్తిజెప్పి
స్పష్టముగ పల్కునట్టుల సాయపడుము
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 85

ఎల్లకాలము నొక్కగా నెట్టులుండు
బండ్లు నోడలు నోడలు బండ్లు గావె
ఎల్లవేళల మదిని భాసిల్లనిమ్ము
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 86

ముడుపు చెల్లించకుండిన మోముకూడ
చూడనోపరు కొందరు కూడదంచు.
ముడుపు లేకుండ పెతలను మోయగలమె!
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 87

సంఘ సేవకుడని తన స్వార్థమునకు
ఎన్నికలు నెగ్గి పదవుల కెగపడంగ
సాగునే యది సుప్రజాస్వామ్య మనగ!
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 88

కలిసియుండిన చోటెల్ల కలసి రాదు
దూరముండిన ప్రేమలు దొర్లి వచ్చు
కాలమున కల్గు మార్పు ల గతుల నెరుగు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 89

దేశ రక్షణకై తమ దీక్షమేర
ప్రాణమిచ్చిన నమర వీరాగ్రగణ్యు
లందరికి కోటి జోహారు లందనిమ్ము
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 90

# పూరి జగన్నాధ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైె నది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్త్యాన్ని యధామూ లంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

30 వ అధ్యాయం

జైమిని ఋషి సంవాదం

( జగన్నాధుని ఉత్సవాలు)

" ఓ మునీశ్వరా! నారదాదులు స్వామి వారి ఉత్సవాలు ఏవిధంగా నిర్వహించారో వివరంగా చెప్పండి" అని ఋషీశ్వరులు ప్రార్ధించగా జైమిని ఈవిధంగా చెప్పారు. ఓ మునీశ్వరులారా! ముందుగా మీకు జ్యేష్ఠస్నానం గూర్చి చెబుతాను. జ్యేష్ట శుక్లదశమి రోజున ఈ వ్రతాన్ని ప్రారంభించాలి. ఉదయాన్నే లేచి పంచతీర్ధ విధానంలో ఆచమనం చేయాలి. స్నానంచేసి, స్వామిని ప్రార్ధించాలి. "తీక్షణమైనవాడా! పెద్ద శరీరం కలవాడా! అగ్ని వంటివాడా! భైరవా! అనుజ్ఞ ఇయ్యి" అని ప్రార్ధించాలి. తరువాత తీర్ధంలో ప్రవేశించి "అఘమర్షణ" మంత్రాన్ని మూడుసార్లు చదవాలి. యధావిధిగా స్నానం చేయాలి. "శివా! శాంతుడా! సర్వ పాపాలను హరించువాడా! నేను స్నానం చేస్తున్నాను. నా పాపాలు హరించు. నా శరీరం సంసారం అనే తాడుతో కట్టబడి ఉంది. చైతన్యం లేదు. నన్ను రక్షించు అని ప్రార్ధించాలి. తెల్లని వస్త్రాన్ని ధరించి, దేవతలను, పితృదేవతలను యధావిధిగా పూజించాలి.

తరువా శివాలయానికి వెళ్లి, నందీశ్వరుని ముట్టుకొని "నందీశ్వరా! ధర్మం నీ నాలుగు పాదాలు. యజ్ఞస్వరూపుడవు. మూడు వేదాలు నీ శరీరం. శివుని వాహనమైన నీకు నమస్కారం" అని ప్రార్ధించాలి." 'అఘోర' మంత్రంతో శివుని పూజించాలి. ఈ విధంగా చేస్తే పది అశ్వమేధ యాగాలు చేసిన ఫలితం కలుగుతుంది,



జగన్నాధుని దగ్గరకువెళ్లి, అక్కడకు దక్షిణంగా ఉన్న మర్రిచెట్టును దర్శించుకోవాలి.” విష్ణువునకు స్థానమైన నీకు నమస్కారం. కల్పాంత వరకు నిలచి ఉంటావు. మా పాపాలను హరించు”అని ప్రార్ధించాలి.

స్వామికి ఎదురుగా ఉన్న గరుత్మంతుని దగ్గరకు వెళ్లి, “వేద స్వరూపమా1 యాన రూపమ! యజ్ఞరూపమా! అంతటా వ్యాపించిన వాడా! నీకు నమస్కారం” అని ప్రార్ధించాలి.

స్వామిని దర్శించుకొని మంత్రాలతో కాని, ద్వాదశాక్షరీ మంత్రంతో గాని,నామజపంతో కాని స్వామిని అర్చించాలి. ”ఓ జగన్నాధా! సంసార సముద్రాన్ని దాటించువాడా! భక్తులను అనుగ్రహించువాడా1 నీ పాదాలను ఆశ్రయించిన నన్ను అనుగ్రహించు” అని ప్రార్ధించి స్వామిని ప్రసన్నుని చేసుకోవాలి.(1-62)

సముద్ర స్నానం చేయడానికి వెళ్లి, నారాయణుని ప్రార్ధించాలి.””పురుషోత్తమా! విష్ణుమూర్తి! నీకు నమస్కారం. సర్వవ్యాపకుడా! చరాచర రూపుడా! జగత్ప్రభూ! శంఖ చక్ర గదాధరా! ఈ తీర్ధంలో స్నానం చేయడానికి అనుమతించు”అని ప్రార్ధించాలి. విష్ణువును స్మరిస్తూ సముద్రానికి చేరాలి. మార్గమధ్యలోఉన్న ఉగ్రనరసింహమూర్తిని దర్శించుకొని, ఈవిధంగా ప్రార్ధించాలి.

“ఓ ఉగ్రసేనా! బాహుబలా1 ఉగ్రమైన పరాక్రమం కలవాడా1 సముద్రస్నానం చేయడానికి అనుమతించమని ప్రార్ధించాలి. ఇక్కడ వచ్చిన దేవతలను ప్రార్ధించాలి. “కర్మలకు సాక్షులయిన మీరు నన్ను స్వర్గానికి తీసుకు వెళ్లండి. మీరు ఈ సముద్రం నుండి పుట్టారు. మీ మధ్యనుండి స్నానం చేయడానికి అనుమతించండి”అని ప్రార్ధించాలి. తీర్థప్రదేశానికి చేరుకొని, కాళ్లు చేతులు కడుక్కొని, ఆచమనం చేసి ఆసనంపై తూర్పు దిక్కుగా కూర్చోవాలి. ఒక మండపాన్ని నిర్మించి, నాలుగు మూలల కోణాలు, స్వస్తి గుర్తులు వేయాలి. వాటిమధ్య ఎనిమిది రేకులుగల పద్మాన్ని లిఖించాలి. ఆ రేకులపై అష్టాక్షరి మంత్రాన్నివ్రాయాలి. ఆరు అంగాలలో ఆరు వర్ణాలను న్యాసం చేయాలి. మిగిలిన రెండు వర్ణాలను పొట్టమీద, వీపుమీద




ఉంచాలి. పాదాలనుండి తలవరకు వర్ణాలన్ని యధాక్రమంగా మంత్రంతో వ్రాయాలి. ( 63-76)

వర్ణాలన్నిటికి  మూడుసార్లు ఆచమనం చేయాలి. మూలమంత్రంతో ఇరవైఐదు చోట్ల కవచాన్ని బంధించాలి. తూర్పున గోవిందుడు. దక్షిణాన్న వారిజాక్షుడు, పశ్చిమాన్న ప్రద్యుమ్నుడు, ఉత్తరాన హృషీకేశుడు, ఆగ్నేయంలో నరసింహుడు, నైఋతిలో మధుసూదనుడు, వాయువ్యంలో శ్రీధరుడు, ఈశాన్యంలో గదాధరుడు. ఊర్ధ్వంలో తివిక్రముడు, అధోభాగంలో వరాహుడు. అంతటా శంఖ చక్ర గదా ధరుడు. మనస్సులోనారాయణుడు, చైతన్యంలో గరుడధ్వజుడు, బుద్ధిని జనార్ధనుడు, ఇంద్రియాలను దానవ సంహారం చేసిన నారాయణుడు కాపాడుగాక" అని ప్రార్ధించి, కవచాన్ని బంధించాలి.  (77-81)

మనస్సులో షోడశోపచారాలు చేయాలి. పురుషోత్తముని పూజించాలి. జనార్ధనుని మండపై ఆవాహన చేసి, పూజించాలి."ఓ సుదర్శనమా! అజ్ఞానినైన నాకు విష్ణు మార్గాన్ని చూపించు" అని ప్రార్ధించాలి. "జలరూపంలో ఉన్న విష్ణువా! తీర్ధరాజమా!" నీకు నమస్కారము అని ప్రార్ధిస్తూ మోకాళ్ళపై వంగి, సముద్రానికి నమస్కరిస్తూ తీర్ధరాజాన్ని ఆవాహన చేయాలి.  (81- 92)

జలాధీసుని,నారాయణుని అఘమర్షణ మంత్రంతో స్తుతించాలి. పంచారుణ సూక్తాన్ని మూడుసార్లు చదవాలి. అభిషేకం చేసేటప్పుడు ఆరు అంగాలను ఆవాహన చేయాలి.  అంతఃశుద్ధికోసం ఆచమనం చేయాలి. బయటి అవయవాల శుద్ధికోసం దర్భలు ముంచిన నీటితో తడ పాలి. తలపై చేతులు పెట్టుకొని మూడుసార్లు తడపాలి స్నానం చేసేటప్పుడు జపం చేయకూడదు. మూడుసార్లు స్నానం చేస్తే అనేక జన్మల పాపం పోతుంది. స్నానం చేస్తున్నప్పుడు నారాయణుని స్మరించాలి.  (93-97)



స్నానం పూర్తి అయిన తరువాత ఆచమనంచేసి మంత్రాన్ని చదువుకోవాలి."ఓ అగ్ని! నీవు లోకనాథుడవు. రేతస్సును ధరించు వాడవు. కోర్కెలను రేకెత్తించు వాడవు. ముఖ్యుడవు. ప్రభువువి. నాశనం లేని వాడవు. అమృతానికి అరణివి. దేవతలకు మూలానివి. నీటికి అధిపతివి"అని ప్రార్థించాలి. ( 98 -99 )

స్నానం పూర్తయ్యాక ఒడ్డుకు వచ్చి ఆచమనం చేయాలి. తెల్లని బట్టలు కట్టుకొని, శంఖ చక్రాది చిహ్నాలు, ఊర్ధ్వపుండ్రం ధరించాలి. తర్పణాలు అర్పించాలి. మండలానికి ఉత్తరముఖంగా కూర్చుని మూల మంత్రాన్ని చదవాలి.శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామిని అర్చించాలి.

"పరమానందా! సర్వ వ్యాపకుడా! నన్ను అనుగ్రహించు.ఈ చరాచర ప్రపంచమంతా ఇక్కడే ఉంది. నీటిని ఆసనంగా చేసుకున్నవాడవు. నీ పాదాలనుండి పుట్టిన గంగ లోకాలను పవిత్రం చేస్తోంది.నీకు పాద్యాన్ని సమర్పిస్తున్నాను. బ్రహ్మాదులచే కొలవబడుచున్న నీ పాదాలకు అర్ఘ్యం సమర్పిస్తున్నాను. పాపాలు పోగొట్టు నీకు వస్త్రాలు సమర్పిస్తున్నాను. భూమిని ఉద్ధరించిన నీకు సముద్ర స్నానం చేయిస్తున్నా. బ్రహ్మాండాలను కప్పిఉంచిన నీకు వస్త్రాలు సమర్పిస్తున్నాను. యజ్ఞ పురుషుడవైన నీకు యజ్ఞోపవీతం సమర్పిస్తున్నాను. నీ శరీరంపై ఆభరణాలు ప్రకాశిస్తున్నాయి. అట్టి నీకు ఆభరణాలు సమర్పిస్తున్నాను. నీ వలన వృక్షాలు సుగంధభరితం అవుతున్నాయి. నీకు గంధం సమర్పిస్తున్నాను. పాపాలను నశింపచేయు నీకు పుష్పాలు సమర్పిస్తున్నాను. అగ్ని స్వరూపమైన నీకు ధూపం సమర్పిస్తున్నాను. దీపాలను ప్రకాశింపచేయు నీకు దీపం సమర్పిస్తున్నాను. అన్ని ప్రాణులకు అన్నం పెట్టే నీకు నైవేద్యం సమర్పిస్తున్నాను. దేవతా స్త్రీలను కూడా మోహింపచేయు నీకు తాంబూలం సమర్పిస్తున్నాను. భవబంధాల నుండి ముక్తి కలిగించు నీకు నమస్క రిస్తున్నాను"అని స్వామిని ఆరాధించాలి.

స్వామి తనకంటే వేరుగా ఉన్నట్లు భావించాలి. పద్మాలతో స్వామికి అర్ఘ్యం సమర్పించాలి. దూర్వాలతో గాని, విష్ణుకాంత పుష్పాలతోగాని, అర్ఘ్యాన్ని సంస్కరించాలి. బంగారంతో గాని, వెండితో గాని, రాగితో గాని చేసిన పళ్ళెంలో గంధం, పుష్పాలు ఉంచి అర్ఘ్యమివ్వాలి. దూర్వలు, దర్భలు, నువ్వులు కలిపి స్వామిని పైనుండి




తుడవాలి. ఈవిధంగా స్వామికి అర్ఘ్యం ఇవ్వాలి.

( 100 - 127 )

జాజికాయలు, కంకోణములు,లవంగాల పొడి కలిపిన నీటిని ఆచమనానికి సిద్ధం చేయాలి. తేనె, నెయ్యి, ఆవుపాలు కలిపి కంచు పాత్రలో పోసి పైన అలాంటి పాత్రనే మూతగా ఉంచాలి. పండ్ల రసాన్ని వడగట్టి అభిషేకానికి సిద్ధం చేయాలి. పట్టు వస్త్రాన్ని స్వామికి సమర్పించాలి. ఆవునేతితో గాని, నువ్వుల నూనెతోగాని దీపారాధనకు సిద్ధం చేయాలి. శక్తికి తగినట్లు ఆభరణాలు సమర్పించాలి. పట్టు ధారంతో గాని నూలుధారంతో గాని చేసిన యజ్ఞోపవీతం సమర్పించాలి. కర్పూరం, గంధం, కుంకుమ స్వామికి పూయాలి.సుగంధం కలిగిన పుష్పాలతో చేసిన మాలలు స్వామికి అర్పించాలి. రకరకాల పిండివంటలు, ఆవుపాలు, పెరుగు, అరటి పండ్లు నైవేద్యంగా పెట్టాలి. స్వామికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించేటప్పుడు ఆచమన నీటిని వాడాలి. మిగిలినచోట్ల మంచినీటిని వాడాలి. చందనం, కర్పూరం, జాజి, లవంగం కలిగిన తాంబూలం స్వామికి సమర్పించాలి. మూల మంత్రంతో నూట ఎనిమిది సార్లు స్వామికి ప్రదక్షిణ చేయాలి.

"జగన్నాయకా! తీర్థ స్వరూపుడా! దేవతా స్వరూపుడా! నీ అనుగ్రహం వలన ఈ తీర్థంలో స్నానం చేయగలిగాను. ఫలితం కలుగునట్లు అనుగ్రహించు. పాపాలలో మునిగిన నన్ను అనుగ్రహించు" అని ప్రార్థిస్తే అన్ని తీర్థాలలో స్నానం చేసిన ఫలితం కలుగుతుంది. (128-141)

కోటి ఆవులను, కోటి యజ్ఞాలు, కోటి దానాలు చేసిన ఫలితం కలుగుతుంది. ఇక్కడ పిండ ప్రదానాలు చేస్తే కోటిరెట్లు ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది. పాపాలు నశిస్తాయి. యముడు భయపడి పారిపోతాడు.

దేవతలు ఇక్కడికి వచ్చి సముద్రస్నానం చేయాలని కోరుకుంటారు. నీటిని నారాయణునిగా భావించి, స్నానం చేయాలి. గోహత్యాది పాపాలన్ని సముద్రస్నానం వలన నశిస్తాయి. అన్ని దేవాలయాలు, తీర్థాలు దర్శించిన ఫలితం ఒక్క సముద్ర స్నానం వలన కలుగుతుంది.

ఆరు శాస్త్రాలు, కురుక్షేత్రంలో దానాలు, చాంద్రాయణాది వ్రతాలు, తపస్సు మెదలయినవి చేయుట సులభం. సముద్ర జలాలతో పిత్ర తర్పణాలు ఇవ్వడం కష్టం. ఇక్కడ పిండప్రదానం చేస్తే పితృదేవతలు శాశ్వత బ్రహ్మలోకాన్ని పొందుతారు.

ఈ విధంగా సముద్ర స్నానం పూర్తయ్యాక శ్రీకృష్ణ బలరామ,సుభద్రలను దర్శించుకోవాలి.( 142-168)

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలోని పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యంలోని జైమిని-ఋషి సంవాదము అను ముప్పదివ అధ్యాయం సమాప్తం.

(ఇంకా వుంది)

# సప్త మోక్ష నగరాలు

కొత్త రామానందం



జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పరమావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయతమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపురుషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్ధ కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్రమాదరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైనప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహకరించాలని ఆశించడం సహజం. భగవంతుని అనుగ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తాడు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయడానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు. వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప్త నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూతనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్ష దాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప్త మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అందువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

**అవి అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జయిని) మరియు ద్వారక.**

# కాశీ మహానగరం

**2. భారత మాత దేవాలయం:**

1936 సం || లో ఈ ఆలయాన్ని గాంధీగారు ఆవిష్కరించారు. ఇక్కడ అనేక దేవతా విగ్రహాలే కాకుండా పెద్ద భారతమాత పటం కూడా వుంది. ఈ పటానికి అందరూ నమస్కరిస్తారు. కాశీలో గంగానది తీరంలో గంగేశ మందిరం వుంది. కాశీకి వచ్చిన యాత్రికులందరూ కాశీని వదిలి వెళ్ళేటప్పుడు ఈ మందిరంలో తమ తిరుగు ప్రయాణాన్ని గురించి తెలియజేయాలంటారు.

**3. తులసీ మానస్ దేవాలయం:**

కాశీలో చూడవలసిన దేవాలయం. ఈ దేవాలయాన్ని 1964 లో నిర్మించారు. రామచరిత మానస్ గ్రంథంలోని శ్లోకాలన్నింటినీ ఈ దేవాలయ గోడలమీద చితీకరించారు. మొత్తం రామాయణ కథనంతా కదలాడే బొమ్మలతో ప్రదర్శించే విచిత్రాన్ని కూడా ఇక్కడ చూడవచ్చు.

**4. కాశీ విశ్వవిద్యాలయం:**

ఈ విశ్వవిద్యాలయాన్ని పండిత మదన మోహన మాలవీయా అని బీసెంట్ కలిసి స్థాపించారు. 200 ఎకరాల విశాలమైన స్థలంలో ఈ విశ్వవిద్యాలయం ఉంది. విశ్వవిద్యాలయ బిర్లా మందిర్ ఆవరణలో విశ్వనాథ మందిరం ఉంది. ప్రధాన మందిరంలో పాలరాతితో చెక్కిన లక్ష్మీ నారాయణుల విగ్రహాలు, శివలింగం, పంచముఖేశ్వరుడు, దుర్గాదేవి మొదలగు





దేవతా విగ్రహాలు ఉన్నాయి. రోజూ ఈ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారు. యాత్రికులే కాక... ఆ విద్యాలయ ప్రాంగణ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, దర్శనం చేసుకుంటూ ఉంటారు. ఆలయం చాలా శుభ్రంగా సుందరంగా తీర్చిదిద్దారు. ఇచ్చటి ప్రశాంత వాతావరణం ఆధ్యాత్మిక చింతనకు, ధ్యానమునకు అనువుగా వుంటుంది.

5. తిల బాండేశ్వర ఆలయం :

ఈ ఆలయ శివలింగం రోజుకు ఒక నువ్వు గింజంత పరిమాణంలో పెరుగుతుందట. మెట్లెక్కి పెద్ద శివలింగాన్ని దర్శించుకోవాలి. సంవత్సరాలు గడిచే కొద్దీ అంతస్తులను పెంచుతున్నారు.

6. సారనాథ్ బౌద్ధ దేవాలయం:

కాశీకి 8 కి.మీ. దూరంలో బౌద్ధులకు అత్యంత పవిత్ర క్షేత్రం సారనాథ్ ఉంది. బుద్ధుడు బౌద్ధగయలో జ్ఞానం పొందిన తరువాత ఇక్కడ తన మొదటి శిష్యులకు తన బోధనలు తెలియజేశాడని చరిత్రకారులు తెలియజేస్తున్నారు. సారనాథ్ ఎంతో రమణీయమైన కట్టడాలతో ఉన్న సుందరమైన యాత్రాస్థలం.

స్నాన ఘట్టాలు:

కాశీ నగరంలో గంగా స్నానమాచరించుటకు యాత్రికుల సౌకర్యార్థం 64 స్నానఘట్టాలు ఉన్నాయి. యాత్రికులు గంగానదిలోని పడవలలో ప్రయాణించి ఈ స్నాన ఘట్టాలన్నీ తిలకించవచ్చును. ఇచ్చటి ఘట్టాలన్నింటినీ మహారాజులు, ఋషులు తమ తపశ్శక్తితో నిర్మించియున్నారు. వీటిని ఆనుకుని చాలా చక్కని రాజ భవంతులను నిర్మించారు. అవి నేటికీ అత్యంత సుందరంగా కానవస్తాయి. కొన్ని రాజభవంతులలో యాత్రికుల సౌకర్యార్థం హోటల్స్ ను నిర్వహిస్తున్నారు. అనేక లక్షల యాత్రికులు ప్రతి రోజూ భక్తి శ్రద్ధలతో గంగానదిలో స్నానమాచరించి దాన ధర్మములు చేస్తారు. స్వయంగా అచ్చట శివలింగాలను నెలకొల్పి అభిషేకం చేసుకుని తమ కోర్కెలను విన్నవించుకుంటారు. ఇచ్చట గంగ చాలా పవిత్రమైనది కావున ఈ గంగా జలాన్ని సీసాలలో రాగిపాత్రలలో నింపుకుని తమ ఇంటివద్ద గంగపూజ నిర్వహించి, తమ బంధువర్గానికి కూడా గంగా జలాన్ని పంచి తృప్తి చెందుతారు.

యాత్రికులు ఎక్కువగా 1) దశాశ్వమేధ ఘాట్ 2) ప్రయాగ ఘాట్, 3) మీర్ ఘాట్ 4) మణికర్ణికా ఘాట్ (మధ్యాహ్న సమయంలో




సుచేల స్నానం ముఖ్యమైనది), 5) పంచగంగా ఘాట్, 6) అహల్యాబాయి ఘాట్, 7) కేదారనాథ్ ఘాట్, 8) రాజా ఘాట్, 9) హనుమాన్ ఘాట్ 10) అస్సీ ఘాట్ 11) చౌతస్సి ఘాట్ 12) మానససరోవర్ ఘాట్, 13) గాయ్ ఘాట్, 14) నేపాలీ ఘాట్ 15) విష్వేదర్ ఘాట్లలో ఎక్కువ యాత్రికులు స్నానాలు ఆచరిస్తున్నారు.

చాలామంది కార్తీకమాసంలో కాశీయాత్రను ఆచరించి శివుని, ఆయన సతీమణులు విశ్వేశ్వరి దేవి మరియు అన్నపూర్ణాదేవి అమ్మవార్లను దర్శించుకుని పునీతులౌతారు. ఈ యాత్ర చేపట్టినవారందరూ 1) గయ క్షేత్రాన్ని, 2) ప్రయాగలో త్రివేణి సంగమం (గంగ యమునా సరస్వతి నదుల కలయిక) వద్ద స్నానమాచరించి, పెద్దలకు పిండ ప్రదానాలు చేసి తరిస్తారు. ఈ ప్రయాగ క్షేత్రంలో 'మాధవీదేవి' శక్తి పీఠం ఉన్నది. ఇచ్చటి గంగానది ఒడ్డున అనేక యాగాలు చేసిన కారణాన ఈ నగరాన్ని 'ప్రయాగ' అని పిలుస్తారు.

గయ క్షేత్రంలో యాత్రికులు తమ పెద్దలకు తీర్థ విధులు నిర్వహించి వారి ఆత్మలకు శాంతి ప్రసాదించమని మహా విష్ణువును కోరుకుంటారు. ఇచ్చటకు వచ్చిన యాత్రికులు ఒక పండును ఒక కాయను విడిచిపెట్టి, ఇక ఈ జన్మలో వాటిని భుజించరు. గయ క్షేత్రంలో శక్తిపీఠమైన మాంగల్యగౌరి ఆలయం ఉన్నది. ఈ ఆలయమందు శిలారూపంలో ఉన్న సతీదేవి వక్షోజాలకు పూజలు నిర్వహిస్తారు. ఇచ్చటకు 12 కి.మీ. దూరంలో బుద్ధగయను కూడా దర్శించుకుంటారు. బుద్ధునికి ఇచ్చటనే జ్ఞానోదయం అయింది. విదేశీయులు ఈ ప్రాంతమందు అనేక సుందర దేవాలయాలు నిర్మించారు. వందలాది బౌద్ధులు ఈ ఆలయాలను భక్తి శ్రద్ధలతో తిలకిస్తారు.

కాశీలోని కొన్ని వింతలు విశేషాలు:

1. కాశీలో గద్దలు ఎగరవు. గోవులు పొడవవు. బల్లులు అరవవు. శవాలు కంపు కొట్టవు. కాశీలో మరణించిన ప్రతి జీవి కుడి చెవి పైకి లేచి ఉంటుంది.

2. కాశీలో మందిరం చుట్టూ అనేక చిన్న చిన్న సందులు కలిగి అట్టి సందులు వలయాకారంలో ఉండి ఒక పద్మవ్యూహం లాగా కొత్తవారికి జాడ దొరకనట్టుగా ఉంటుంది.

3. ఇంతకు పూర్వం అనేక సుందర వనాలు, పూల చెట్ల



మధ్య ఉండే మందిరం చుట్టూ, తురుష్కుల దండయాత్రల-నుంచి కాపాడుకోవటానికి, పెద్ద బంగళాలు కట్టి శత్రు సైనికులకు దారి లేకుండా చేశారు.

4. అనేక దేశాల నుండి పెద్ద పెద్ద శాస్త్రవేత్తలు వచ్చి కాశీలో అనేక పరిశోధనలు జరిపి ఆశ్చర్య-పోయారు. అసలు ఈ కాస్మో-ర్స్ ఎక్కడనుండి వస్తున్నాయి? అచ్చటి పూర్వీకులు శక్తి చలనం ఉన్నచోటల్లా మందిరాలు ని-ర్మించారు. అంతటి పరిజ్ఞానం ఆ రోజుల్లో వారికి ఎక్కడినుండి వచ్చిందని ఆశ్చర్యానికి గురిఅ-య్యారు.

5. కాశీ విశ్వేశ్వరునికి భస్మ లేపనంతో పూజ ప్రారంభిస్తారు.

6. కాశీలోని పరాన్న భుక్తేశ్వరుణ్ణి దర్శిస్తే జీవికి పరుల అన్నం తిన్న ఋణం నుండి ముక్తి లభిస్తుంది.

7. కాశీక్షేత్రంలో పుణ్యం చేస్తే కోటి-రెట్లు ఫలితం ఉంటుంది. పాపం చేసినా కోటిరెట్ల పాపం అంటు-కుంటుంది.

8. విశ్వనాథుణ్ణి అభిషేకించిన తరువాత చేతిరేఖలు మారిపో-తాయి.

9. ఇక్కడి శక్తిపీఠం విశాలాక్షి అమ్మవారు, జగత్తు అంతటికీ అన్నం పెట్టే అన్నపూర్ణాదేవి నివాస స్థలం కాశీ.

10. ప్రపంచం లోని అన్ని భాషలకు తల్లి అయిన అతి ప్రాచీన సంస్కృత పీఠం కాశీలోని ఉన్నది.

పరమేశ్వరుని పట్టణం విజ్ఞాన వి-కాసాలకు నిలయం. జ్ఞాన జ్యోతికి ఆవాసం. ఆధ్యాత్మిక పరమైన చింతనకు నెలవు. జీవులకు ము-క్తినొసగే పావనధామం. గంగాన-దిలో పునీతమయ్యే ఘాట్ లు గల నగరం. ముక్కోటి దేవతల పద ఘట్టనలతో పునీతమైన భూమి. యాత్రికుల అంతిమ లక్ష్యం- ఈ నగర యాత్రే. ఇలా ఎన్నెన్నో ప్ర-త్యేకతలతో అలరారుతున్న ఈ పురాతన నగర యాత్ర ప్రతి భార-తీయుడు జీవితంలో ఒక్కసారైనా చేయాలనుకునే పవిత్ర యాత్ర.

(ఇంకా వుంది)

# నూటపదహార్లు కందాల్లో సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

65) ఎక్కడ పుట్టెను జానకి
ఎక్కడ మెట్టెను చివరకు నెయ్యెడ జేరెన్
ఎక్కడి శయ్యా గృహంబు
లిక్కడి కఠిన శయనంబు లియ్యది తగునే!

65. ఆమె అవస్థ చూసి హనుమంతుడు చాలా బాధ పడ్డాడు. ఎక్కడ పుట్టింది? ఎంతటి మహానుభావుడిని వరించింది? ఎన్ని సుఖాలు అనుభవించింది? అటువంటి మహా తల్లికా ఇంతటి దురవస్థ! అని జాలి పడ్డాడు.

66) మారుతి హృదయము కరిగెను
ఘోరంబిది యంచు వారి గూల్చగ దలచెన్
శ్రీరాముడు మది మెదలగ
వీరావేశము తగదని వేచగ నెంచెన్

66. తల్చుకున్న కొద్దీ ఆయనకి రాక్షసుల మీద కోపం ముంచుకొచ్చింది. ఒక్కసారిగా విజ్రంభించి అందరినీ మట్టు పెట్టేద్దాం అనుకున్నాడు. అంతలోనే శ్రీరాముడిని తల్చుకుని, అంత వీరావేశం మంచిది కాదని శాంతించాడు.

67) చక్కగ నుదయమె వచ్చెను
రక్కసుడు బలముల తోడ రమణిని జూడన్
ఎక్కడి రాముడు మరువుము
ఇక్కడ రాణిగ మెలంగు మింతీ వినుమా!

67. ఈ లోగా తెల్లవారజొచ్చింది. రావణాసుడు తన బలగంతో సహా సీతను చూడడానికి వచ్చాడు. "నీ పిచ్చిగానీ ఇంకెక్కడి రాముడు? ఎప్పుడు వస్తాడు? అదంతా కల్ల. మరిచిపో! నన్ను పెళ్లి చేసుకుని స్వర్గ సుఖాలు అనుభవించు.

68) పట్టపు రాణిని జేసెద
పెట్టెద సకలము ఫణముగ పీఠము నిత్తున్
చుట్టెద బంగరు చీరలు
పట్టెద నీకాళ్ళు గూడ పడతీ యింకన్

68. నిన్ను పట్ట మహిషిని చేస్తాను. నీకేం కావాలంటే అది తెచ్చి ఇస్తాను. బంగారపు చీరలు ఇస్తాను. నీ కాళ్ళు పట్టుకుంటాను.

69) కోరుము సంపద లన్నియు
కోరుము యీ భూతలంబు కూర్చెద నీకున్
కోరుము ప్రాణము నిచ్చెద
ఓరిమి లేదింక నాకు ఒప్పుగ సీతా!

69. "ఎన్ని సంపదలు కావాలో కోరుకో! ఈ భూతలం అంతా నీ చేతుల్లో పెడతాను. నా ప్రాణం కోరినా ఇచ్చేస్తాను. ఇంక నా ఓపికని పరీక్షించకు. వెంటనే అంగీకరించు" అని ఆమె ముందు మొర పెట్టుకున్నాడు.

70) పరపురుషు జూడ నేరక
కరమున తృణమొకటిపట్టి కనులటు నిలిపెన్
సురవైరికి వశము గాదనె
పరమాత్ముని దరికరుగను పది జన్మలకున్

70. సీత తలెత్తి పరపురుషుడు, దుర్మార్గుడు అయిన రావణుడిని చూడడానికి ఇష్ట పడలేదు. ఒక గడ్డి పరకని చేతిలోకి తీసుకుని దాని మీద దృష్టి నిలిపి చెప్పింది. "ఆ పరమాత్ముడు తప్పక వస్తాడు. నువ్వు పది జన్మలెత్తినా ఆయనతో సరి తూగలేవు." అంది

71) దుష్టుని శపించె జానకి
నష్టమగును లంక నాశనమగును భ్రష్టా!
కష్టములెందుకు కొందువు
దుష్టా! వచ్చును రఘుపతి దునుమగ నిన్నున్

71. "అంతే కాకుండా శ్రీరాముడు కోపిస్తే లంక అంతా నాశనం అవుతుంది. ఎందుకు నువ్వు ఈ కష్టాలు కోరి తెచ్చుకుంటావు?"అని శపించింది.

72) ఆసలు తీరక నసురుడు
మాసద్వయము గడువిత్తు మానిని నీకున్
ఈసారి వల్లకుంటిని
బాసయె నన్నొల్లకున్న వండుకు తిందున్

72. అయినా సరే, ఎప్పటికైనా ఆమెను లొంగదీసుకోవాలనే కోరికతో, రావణుడు కోపంగా "నీకు రెండు నెలలు గడువు ఇస్తున్నాను. అప్పటికీ నువ్వు మారకపోతే నిన్ను ముక్కలు ముక్కలుగా నరికి వండించుకు తినేస్తాను. కాని వదిలి పెట్టను " అని భయపెట్టాడు.

(సశేషము)

# గ్రీసు దేశపు పురాణ గాథలు



## వేమూరి వేంకటేశ్వరరావు

## 11. క్రీసస్ ఉదంతం




ద్వాదశ ఒలింపియను దేవతలలో అపాలో ఒకడు. అతనికి వచ్చిన అనేక విద్యలలో దివ్యదృష్టి ఒకటి; అతను భవిష్యత్తులోకి చూసి ఏమి జరగబోతోందో చెప్పగల సమర్ధుడు. ఒలింపియను దేవతలలో చాలమందికి ఈ రకం “దివ్యదృష్టి” ఉంది కానీ ఒక్క అపాలో మాత్రమే ఈ విద్యని మానవులతో పంచుకోడానికి సుముఖత చూపేవాడు. ఇందుకని అపాలో అనేక “మఠాలు” స్థాపించి, ప్రతి మఠం లోనూ “ఓరకిల్” (Oracle) అనే ఒక “దివ్యవాణి”ని ప్రతిష్ఠ చేసేడు. ఓరకిల్ అంటే సర్వజ్ఞుడు, ద్రష్ట, ప్రవక్త అనే అర్థాలు చెప్పుకోవచ్చు. ఈ “ఓరకిల్” అనేది ఒకరి ఒంటి మీదికి ఆవహించి వారి నోట పలికే భవిష్యవాణి. మన దేశంలోనూ గణాచారుల ఒంటి మీదికి పూనకం రావడం, అప్పుడు వాళ్ళు ఏదైనా చెప్పడం ఉన్నాయి. ఇప్పటికీ సమ్మక్క జాతరలో ఇలా అమ్మవారు ఒంటి మీదకు వచ్చి ప్రజలకు సందేశం ఇవ్వడం జరుగుతూనే ఉంది. అపాలో స్థాపించిన ఇటువంటి “మఠాలు” లో డెల్ఫై (Delphi) లో ఉన్న మఠం ప్రసిద్ధి చెందినది. ఈ డెల్ఫై మఠంలో ఉన్న గణాచారిణి పేరు పిథియా (Pithea).

పెద్దలు, పిన్నలు, రాజులు, పేదలు, ఇలా అనేక మంది డెల్ఫైకి వచ్చి వాళ్ళకి భవిష్యత్తులో ఏమి “రాసి పెట్టి ఉందో” చెప్పమని దివ్యవాణిని అర్థించడం, దివ్యవాణి వారి కోరికని పిథియా వాక్కు ద్వారా మన్నించడం జరుగుతూనే ఉంటుంది.

ఇలా డెల్ఫై లో ఉన్న "ఓరకిల్" ని సంప్రదించడానికి వచ్చిన వారిలో సాక్షాత్తూ లిడియా దేశపు రాజు క్రీసస్ (Croesus) ఒకడు. హెరడోటస్ (సుమారు సా. శ. పూ. 484 – 425) రాసిన చరిత్ర ప్రకారం లిడియా రాజ్యాన్ని క్రీసస్ 14 సంవత్సరాలు పరిపాలించేడు (సుమారు సా. శ. పూ. 595 నుండి 546 వరకు). అనగా క్రీసస్ కథ కోసం కల్పన చేసిన శాల్తీ కాదు; నిజంగా చరిత్రలో ఒక మానవుడు. క్రీసస్ అత్యంత ధనవంతుడు. అతను ఎంత ధనవంతుడంటే ఇప్పటికీ "వాడు క్రీసస్ అంత ధనవంతుడు" అనే నుడికారం పాశ్చాత్య భాషలలో ఉంది.

క్రీసస్ అంత ధనవంతుడు అవడానికి రెండు కారణాలు ఉండే సావకాశం ఉంది. లిడియా రాజ్యానికి ముఖ్యపట్టణం అయిన సార్డిస్ (Sardis) గుండా పేక్టోలస్ (Pactolus) అనే నది ప్రవహిస్తోంది. ఆ నదీ గర్భంలో ఉన్న ఒండుమట్టిలో వెండి, బంగారం కలిసిన మిశ్రమ లోహం దొరుకుతుంది. మైదస్ రాజు ఈ పేక్టోలస్ లో స్నానం చేసి తాను పట్టిందల్లా బంగారంగా మారుతున్న "వరం" నుండి విముక్తి పొందేడు అనే ఒక



కథ ఉంది కదా! ఆ కథే ఈ పేక్టోలస్ నదిలో దొరికే ఈ బంగారానికి కారణం అంటారు. నిజానికి క్రీసస్ అంత ధనవంతుడు అవడానికి అతని సామంతులు కట్టే కప్పాలు కూడా కారణం కావచ్చు. క్రీసస్ తనకున్న ఐశ్వర్యంతో తృప్తి పొందలేదు. ఎందుకు పుట్టిందో, ఎలా పుట్టిందో కానీ పశ్చిమ ఆసియాలో ఏకచ్ఛత్రాధిపత్యంతో అలరారుతున్న పారశీక సామ్రాజ్యం పై దండెత్తి ఆ రాజ్యాన్ని తన వశం చేసుకోవాలనే బుద్ధి అతని పుర్రెలో పుట్టింది. ఈ రోజుల్లో అమెరికా ఎలాంటిదో ఆ రోజుల్లో సైరస్ చక్రవర్తి (Cyrus, the Great) పరిపాలనలో ఉన్న పారశీక సామ్రాజ్యం అంత శక్తిమంతమైన దేశం!

బుద్ధి పుట్టడం పుట్టింది కానీ క్రీసస్ మనస్సు పీకుతోంది. యుద్ధం ముగిసే వరకు పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు కదా. అందుకని డెల్ఫై లో ఉన్న "ఓరకిల్" ని అడిగి తెలుసుకురమ్మని కానుకలు ఇచ్చి ప్రత్యేక ప్రతినిధిని పంపేడు. క్రీసస్ డెల్ఫై లో ఉన్న "ఓరకిల్" కి ఇచ్చిన కానుకలు ఆ ఆలయంలో హెరడోటస్ కాలం వరకు ఉన్నాయిట! క్రీసస్ తరఫున రాయబారులు డెల్ఫై లో ఉన్న "ఓరకిల్" ని అడిగిన ప్రశ్న: పారశీక దేశం మీదకి క్రీసస్ దండయాత్ర జరిపితే పర్యవసానం ఎలా ఉంటుంది?"

ఈ ప్రశ్నకి సమాధానంగా పిథియా ద్వారా ఓరకిల్ ఇచ్చిన సమాధానం: "క్రీసస్ ఒక అద్భుతమైన సామ్రాజ్యాన్ని సర్వనాశనం చేస్తాడు."

"దేవుడు మన పక్షం. దండయాత్రకు సంసిద్ధం అవండి!" అని క్రీసస్ ఆజ్ఞ జారీ చేసేడు. క్రీసస్ సేనా వాహిని గట్లు తెంచుకుని పెల్లుబికి ప్రవహించిన నదిలా ఒక్కుమ్మడి పారశీక సామ్రాజ్యం మీద విరుచుకు పడింది. పారశీక చక్రవర్తి సైరస్ సైన్యం క్రీసస్ ని చిత్తు చిత్తుగా ఓడించి క్రీసస్ ని బందీగా తీసుకుపోయింది. చిట్టచివరికి చావు తప్పి కన్ను లొట్టపోయిన చందాన సైరస్ కొలువులో క్రీసస్ చిన్న గుమస్తా ఉద్యోగం

చేస్తూ శేష జీవితం గడిపేడు.

తనని ఈ విధంగా ఓరకిల్ పచ్చి మోసం చేస్తుందని క్రీసస్ కలలో కూడా అనుకోలేదు. ఓరకిల్ ని ఊరకనే సలహా ఇమ్మని అడగలేదు. బిళ్లకుడుములులా పారితోషికం (లంచం) సమర్పించుకున్నాడు కదా! పట్టపగలు బహిరంగంగా ఇంత పచ్చి మోసమా? మునుపటిలా ఇప్పుడు ఆస్తులు, అంతస్తులు లేవు. అయినా ఉన్న దాంట్లో కాసింత గోకి, గోకి చిన్న పారితోషికంతో తోటి గుమస్తాని పంపేడు - జరిగిన అన్యాయానికి కారణం ఏమిటో తెలుసుకు రమ్మని.

తాను రాసిన "హిస్టరీ" అనే గ్రంథంలో హెరడోటస్ జరిగిన అన్యాయానికి కారణం ఈ విధంగా చెబుతాడు: "డెల్ఫైలో ఉన్న ఓరకిల్ చెప్పిన జోస్యం ప్రకారం క్రీసస్ పారశీక దేశం మీద దండయాత్ర చేస్తే ఒక మహా సామ్రాజ్యం సర్వనాశనం అయిపోవాలి. "ఆ నాశనం అయిపోబోయే సామ్రాజ్యం ఎవరిది? తనదా? శత్రువుదా?" అని అడగవలసిన కనీసపు బాధ్యత క్రీసస్ ది. అధికారంలో ఉన్న పాలకులకి సలహాదారులు సలహాలు ఇచ్చినప్పుడు "ఆ సలహా అమలు పరచితే పర్యవసానం ఎలా ఉంటుంది?" అని అడగకుండా "లేడికి లేచిందే పయనం" అన్న రీతిలో రాజ్యం ఏలితే ఇలానే ఉంటుంది. ఇది స్వయంకృతాపరాధం."

క్రీసస్ పరాజయం గ్రీసు దేశపు చరిత్రలో విస్మరించడానికి వీలులేని మైలురాయి.

ప్రచ్ఛన్న అర్థ సందిగ్ధతలతో మాట్లాడడం ఈ నాటి జ్యోతిష్కుల ఆయుధం ఎలాగయిందో అలాగే అలనాటి ఓరకిల్ లకి కూడా ఆయుధం అయి ఉండాలి. ఎంత సర్వజ్ఞుడిని అయినా సరే మనం అడిగే ప్రశ్నలు అర్థవంతంగా ఉండాలి, నిర్ద్వందంగా ఉండాలి. సరి అయిన గురి పెట్టి అడగాలి. అదే విధంగా నిష్ణాతులు ఇచ్చే సలహాలని విధివిధానాలుగా మార్చి అవలంబించే ముందు ఆ సలహాల పర్యవసానాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం పాలకులు నేర్చుకోవాలి.

ఈనాటి ప్రభుత్వాలకి ఓరకిల్ లు ఎవరు? శాస్త్రవేత్తలు, స్మరణ తటాకాలు (think tanks), విశ్వవిద్యాలయాల్లో ఉన్నత ఆసనాలు అధిష్టించిన ఆచార్యులు, వగైరాలు. ఈ పిదప కాలపు ఓరకిల్ లను ప్రభుత్వాలు అప్పుడప్పుడు, అయిష్టంగానే, సంప్రదిస్తాయి. కొండకచో కొన్ని ఓరకిల్ లు అడిగినా, అడగక పోయినా వారి విలువైన అభిప్రాయాలని ఉచితంగా జారీ చేస్తూ ఉంటారు: "ఆకాశంలో ఓజోన్ పొరలో చిల్లు పడడం వల్ల పర్యావరణం దెబ్బ తింటోంది." "పర్యావరణం వేడెక్కిపోవడం వల్ల ధ్రువ ప్రాంతాలలో మంచు కరిగిపోయి దాని వల్ల తీర ప్రాంతాలు ముంపుకి గురి అవుతాయి," వగైరా. ఈ అభిప్రాయాలైనా సరళమైన, నలుగురికీ అర్థం అయే భాషలో ఉంటాయా? ఉండవు. శాస్త్రీయ పరిభాషలో, సంభావ్యతలు, శాతాలు, గంట ఆకారంలో ఉన్న చిత్రపటాల రూపంలో ఉంటాయి. రాజనీతి తంత్రజ్ఞులు విధివిధానాలని జారీ చేసే ముందు ఈ పరిభాషని అర్థం చేసుకుని అప్రమత్తతతో మెలగాలి. ఆ అప్రమత్తతకి కనీస శాస్త్రీయ పరిజ్ఞానం, అవగాహన అత్యవసరం. మనం ఎన్నుకున్న ప్రతినిధులలో ఎంతమందికి ఈ రకం శాస్త్రీయ అవగాహన ఉంటోంది?

సంప్రదించిన మూలాలు:

Carl Sagan, Croesus and Cassandra, Chapter 9 in Billions & Billions, Random House, New York, NY 1997.

(సశేషము)

# ప్రేమంటే ఇంతే



ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

(గతసంచికతరువాయి)

ఆ మాట వినగానే..."ప్రేమనగర్" సినిమాకి వెళ్ళిన రోజు ఇదే మాట నువ్వు కూడా అన్న విషయం గుర్తుకొచ్చి నా ముఖంలో కొంచం మార్పు వచ్చింది. ఆ మార్పు గమనించిన రుక్మిణి..."మీరు అన్యమనస్కంగా వున్నారన్న విషయం నిర్వివాదాంశం. ఇప్పుడు కూడా నేను 'మీ మగ వాళ్ళకి అబద్ధం చెప్పడం రాదండి'

అన్నాక మీ ముఖకవళికలలో మార్పు నేను స్పష్టంగా గమనించాను. గత కొద్దిసేపు నుండి మీరు మాట్లాడకుండా నిశ్శబ్దంగా వున్నారు. మీరు ఎందుకో కలతగా వున్నారు, ఏదో విషయం మిమ్మల్ని కలవర పెట్టి వేదిస్తున్నాది దాని కారణంగా మీరు మీ మనశ్శాంతికి దూరమవుతున్నారు. మిమ్మల్ని అశాంతికి గురి చేస్తున్న ఆ విషయం దయచేసి నాతో పంచుకోండి" అంది.

నేను మన విషయం చెప్పడమా? వద్దా? అన్న మీమాంసలో పడ్డాను. చెబితే ఏమనుకుంటుందో? ఎలా అర్థం చేసుకుంటుందో? తీరా చెప్పిన తరువాత పర్యవసానం ఎలా వుంటుందో? ఒకవేళ ఇప్పుడు దాచి పెళ్ళి అయిన తరువాత మన విషయం తెలిస్తే అప్పుడు ఏం జరుగుతుందో?...ఇలా చాలా ప్రశ్నలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేశాయి.

నా సంశయాన్ని పసిగట్టి నా మౌనాన్ని భగ్నం చేస్తూ..."ఏమండీ మనం ఒకరినొకరు అర్థం చేసుకొని మన అందమైన భవిష్యత్తుకి పునాది వేసుకోనే ప్రయత్నంలో ఇక్కడ సమావేశమయ్యాము. అందుకని మీ ఆవేదనకి కారణం ఎంతటి గంభీరమైనదైనా లేదా సున్నితమైనదైనా చెప్పండి పరవాలేదు. ఉంకొక విషయం ఇప్పుడు మీకున్న సమస్య భవిష్యత్తులో మన మధ్య సమాధానం లేని ప్రశ్నగా మారుతుందని గాని లేదా అది మన బంధాలని శాసించేదిగా మారుతుందని గాని మీకు అనిపిస్తే తప్పకుండా మీ వేదనని నాతో పంచుకోండి. నాతో పంచుకున్న తరువాత మీకు తప్పక ఉపశాంతి లభిస్తుందని నా నమ్మకం" అంది.

ఆ మాటలు విన్నాక నిజమే భవిష్యత్తులో మన విషయం ఉంకో వ్యక్తి ద్వారా రుక్మిణికి తెలిస్తే దాని ప్రభావం వేరుగా వుంటుంది అందుకని మనసు విప్పి మాట్లాడడమే మంచిదనిపించింది..."రుక్మిణీ నా ఆవేదనకి కారణం గతంలో నా జీవితంలో జరిగిన సంఘటనలు, నీతో అవి తప్పకుండా పంచుకుంటాను ఎందుకంటే అవి ఉంకో వ్యక్తి ద్వారా నీకు తెలియడం నాకు ఇష్టం లేదు అలా జరిగితే దాని ప్రభావం ప్రతికూలంగా వుండవచ్చు"

"చాలా మంచి నిర్ణయము, మొహమాటపడవద్దు చెప్పండి" అంది.

అప్పుడు మనిద్దరి పరిచయం, స్నేహం, ప్రేమ, పెళ్ళి వరకు దారి తీయని పరిస్థితులు, కారణాలు మొత్తం వివరంగా చెప్పాను...ఈ క్రమంలో రుక్మిణి ప్రతిస్పందన ఎలా వుంటుందో అని కొంచం ఒత్తిడికి గురి అయ్యాను. ఎంత దాచుకుందామన్నా నా ముఖములో వస్తున్న మార్పులని నా హావభావముల ద్వారా గ్రహించి రుక్మిణి తన చేతితో నా చేతిని తట్టి కళ్ళతోనే నిబ్బరంగా వుండమని చెప్పింది.

అంతా విన్న తరువాత "ముందుగా మీ గతం నాతో పంచుకున్నందుకు ధన్యవాదములు. విన్న నాకే మీ దురదృష్టానికి బాధ కలుగుతున్నాది, అలాంటిది మీరు ఈ వ్యధని ఎంతో మనో-

వేదనతో భరించారు. ‘బాధ పడకండి మనము అనుకున్నవి అన్నీ అనుకున్నట్లు జరగవు, జీవితమంటే అదే....ఒక్క విషయం నేను మీకు స్పష్టముగా చెప్పదలచుకున్నాను ప్రేమించడం తప్పూ కాదు నేరమూ కాదు. మీ ప్రేమ విఫలమయ్యిందని నేను భావించడం లేదు, దురదృష్టవశాత్తు అది పెళ్ళి వరకు వెళ్ళ లేదని అనుకుంటున్నాను...కాలం ఎలాంటి గాయాన్ని అయినా మాన్పుతుంది, ఎన్నో సమస్యలకి కాలమే పరిష్కారము చూపుతుంది అంటారు ...

...ఈ భూమండలం మీద సమస్యలు లేని మనిషి అంటూ ఎవరూ వుండరండి, ప్రతి మనిషికీ ఏదో ఒక సమస్య వుంటుంది. ఆ సమస్యలను అధిగమించి ముందుకు సాగడమే జీవిత పరమార్ధము. మహేంద్రకపూర్ పాడిన పాట "జీవన్ చల్నే కా నాం చల్తే రహే సుబ్హో సామ్" గుర్తు తెచ్చుకోండి. జీవితమంటే ఎప్పుడూ ముందుకు కొనసాగాలి, అంతేగాని సమస్యలని చూసి ఆగిపోకూడదు. ఇవన్నీ మీకు తెలియనివి కావు” అని తన చల్లని మాటలతో స్వస్థపరచింది.

“రుక్మిణి నీ మాటలు నాకు ఊరట కలిగించాయి”

అప్పటివరకూ వున్న గంభీర వాతావరణాన్ని కాస్త తేలిక పరిచేందుకు “ఇందాక మీరు గతం గురించి చెబుతుంటే కోనసీమ అమ్మాయినే వివాహ-



మాడాలని నిర్ణయించుకున్నట్లు అర్ధమయ్యింది. అది కోనసీమ మీద ప్రేమతోనే కదా? కోపం, పగ, ప్రతీకారం కాదు గదా!!!” అని చిలిపిగా నవ్వుతూ అడిగింది .

“కోనసీమ ప్రకృతి రమణీయత నా మనసు దోచుకుంది. నాకు తెలుగు భాష అన్నా, తెలుగు సంస్కృతి అన్నా చాలా మక్కువ. కోనసీమ వాటికి ప్రతిబింబమని నాకు అనిపించింది, అందుకే అక్కడి అమ్మాయిని చేసుకుంటే కోనసీమతో ఒక శాశ్వత బంధం ఏర్పడుతుందని నా అభిప్రాయము అంతే అంతకు మించి ఏమీ లేదు”

“అయితే పరవాలేదు” అని పకపకా నవ్వింది రుక్మిణి. ఆమె నవ్వుతో నేనూ శృతి కలిపాను.

ఇంతలో సర్వర్ వచ్చి “సార్ కూల్ డ్రింక్స్ తెమ్మంటారా? కాఫీ తెమ్మంటారా” అని అడిగాడు.

"రుక్మిణి నేను కూల్ డ్రింక్స్ తాగను, నువ్వు కాఫీ తాగుతావా? కూల్ డ్రింక్ తాగుతావా?" అని అడిగాను. "నాకు కూడా కూల్ డ్రింక్స్ ఇష్టం వుండవు, కాఫీ తాగుదాము" అంది.

కాఫీ త్రాగుతూ “నా గతాన్ని నిర్మొహమాటంగా నీతో పంచుకున్నాను. నా గురించి నువ్వు ఏ నిర్ణయం తీసుకుంటావో నీ ఇష్టం” అన్నాను.

“ఒక వేళ మీరు చెప్పినదంతా నా గతం అయివుంటే మీ నిర్ణయం ఏమిటి?” అని ఎదురు ప్రశ్న వేసింది రుక్మిణి.

“నీకు మా కుటుంబం గురించి మన మాటలలో చెప్పానుకదా అందువల్ల అటువంటి పరిస్థితిలో నువ్వు వుంటే నిన్ను నేను వివాహం చేసుకోవడానికి నాకు గాని, మా కుటుంబ సభ్యులకి గాని ఎటువంటి అభ్యంతరము వుండదు” అన్నాను

(ఇంకా వుంది)

# స్వతంత్ర భారతదేశంలో మహిళా సాధికారత




## మత్స్యరాజ విజయలక్ష్మి

మహిళా సాధికారత అంటే మహిళలు అన్ని రంగాలలో సాధించిన ప్రగతి. ఈ అంశం మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ 75 సంవత్సరాలలో అంచెలంచెలుగా ఎలా వికసించిందో చూద్దాము. మన దేశానికి స్వాతంత్ర్యము రాకముందు మహిళల స్థితి దయనీయంగా ఉండేది. బ్రిటిష్‌పరిపాలన కాలంలో వారు కొన్ని చట్టాలను తీసుకొని వచ్చారు. మహిళాభివృద్ధికై సతీ సహగమన నిషేధ చట్టమును 1829లో విలియం బెంటింక్ తీసికొచ్చి నాంది పలికారు. వారి పాలన కాలంలోనే బాల్య వివాహముల నిరోధ చట్టం కూడా 1852లో వచ్చింది. 1856లో ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌గారు వితంతు పునర్వివాహ చట్టాన్ని తెచ్చి మహిళలలో ఆలోచనలను రేకెత్తించారు. మన రాష్ట్రంలో మాత్రం 1881లో కందుకూరి వీరేశలింగం పంతులుగారు దీన్ని అమలుపరచారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా మహిళల పరిస్థితిలో పెద్ద తేడా ఏమీ లేదు. స్త్రీలు ఇళ్ళకే పరిమితమైపోయారు. జమీందారీ కుటుంబాలలోని, రాజకుటుంబాలలోని మహిళలకే విద్యావకాశాలు ఉండేవి. పెద్ద నగరాలలోనే పాఠశాలలు, కళాశాలలు ఉండేవి. పెద్ద నగరాలలోనే పాఠశాలలు, కళాశాలలు ఉండేవి.

మన స్వతంత్ర భారత ప్రథమ ప్రధానమంత్రిగారైన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మహిళల పురోగతియే ఆర్థిక పరిస్థితిని నిలబెడుతుందని ప్రగాఢంగా విశ్వసించారు. మహిళలు, బాలికలకోసం ప్రత్యేకమైన పాఠశాలలు, కళాశాలలు వెలిశాయి. 1951లో మహిళల అక్షరాస్యత 8.86% ఉండేది. మా అమ్మగారు కూడా పాఠశాలకు వెళ్ళి చదువుకోలేదు. ఆమెకు ప్రైవేటు ట్యూటరు ఇంటికి వచ్చి తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలను బోధించేవాడు. పరదా పద్ధతి ఉండేది. ఆమె ఎన్నడూ తన గురువును చూసి ఎరుగదు. ప్రాథమికాభ్యాసం హైదరాబాదులోని ఒక బాలికల పాఠశాలలో కొన్ని నెలలుగానే సాగింది. 12వ ఏటనే వివాహం జరిపించారు. బాల్య వివాహములు ఆనాటి ప్రధాన సమస్య. జమీందారి బాలిక పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల స్థితి ఏమిటి? మొదటి పంచవర్ష ప్రణాళికలో పెద్దగా మహిళల అభివృద్ధి ఏమీ జరగలేదు. రెండవ ప్రణాళికలో మహిళా మండళ్ళు ఏర్పాటుచేసి స్త్రీలలో చైతన్యం నింపాలని ప్రయత్నం జరిగింది. కాని పెద్ద నగరాలలో, పట్టణాలలోనే ఇది సాధ్యమైంది. 3వ ప్రణాళికలో మహిళాభివృద్ధి ఊపందుకు-



న్నది. అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో తాలుకాల స్థాయిలో, పెద్ద గ్రామాల స్థాయిలో గ్రామసేవికలు, ముఖ్య సేవికల ద్వారా మహిళల విద్య మరియు ఉపాధి పథకాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మా ఊరిలో అంటే అప్పటి హైదరాబాదు జిల్లా ఇబ్రహీంపట్నంలో ఒక ప్రైవేటు భవనం అద్దెకు తీసుకొని 1965 సం॥లో ఒక మహిళా మండలి వెలిసింది. దానికి అనుసంధానంగా ఒక బాల్వాడి కూడా ఉండేది. దానికి మా అమ్మగారు వైస్‌ప్రెసిడెంటుగా పనిచేసేవారు. నేనప్పుడు నాల్గవ తరగతిలో ఉన్నాను. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివేదాన్ని. మధ్యాహ్న భోజన పథకం ఉండేది. ఐక్యరాజ్యసమితి వారి సహకారంతో మొక్కజొన్న రవ్వ మరియు పాలపొడి వచ్చేవి. శుద్ధమైన వంట నూనె (Rవటఅఅవస ాఅశ్రీ) సప్లై చేసేవాళ్ళు. కాని అన్ని గ్రామాలలో పాఠశాలలు ఉండేవి కావు. పెద్ద గ్రామాలలోనే ప్రాథమిక పాఠశాలలు ఉండేవి. ఉన్నత పాఠశాలలు తాలూకా హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండేవి. మగపిల్లలు సైకిళ్ళపై వచ్చి ఉన్నత విద్యను అభ్యసించేవారు. వారిలో మన కేంద్రమంత్రి వర్యులు శ్రీ గంగాపురం కిషన్‌రెడ్డిగారు ఒకరు. ఆయన తిమ్మాపురం నుండి సైకిలుపై ఇబ్రహీం పట్నం వచ్చి ఉన్నత విద్యాభ్యాసం చేశారు. నాకన్న రెండు క్లాసులు జూనియర్ ఆడపిల్లల చదువులు 5వ తరగతితోనే నిలిచిపోయేవి. పెద్ద ఊరిలో పుట్టినందుకు నా విద్యాభ్యాసం నిరాటంకంగా సాగింది. అప్పటి ఆడపిల్లల దుస్థితికి నేను, మా అమ్మగారు చాలా బాధపడేవాళ్ళం. నా స్నేహితు రాళ్ళు 7,8 తరగతిలోనే బడి మానేశారు. పదవ తరగతికి వచ్చేసరికి ఇద్దరమే మిగిలాము.

తర్వాత బాలికలకు ప్రత్యేకమైన పాఠశాలలు వెలిశాయి. అనుబంధంగా హాస్టళ్ళు. పదవ తరగతి తర్వాత మా ఊరిలో కాలేజీ లేదు. హైదరాబాదులో హాస్టలులో ఉండి విద్యాభ్యాసం మా అమ్మగారికి మమ్మల్ని ఎలాగైనా చదివించాలని పట్టుదలగా ఉండేది. అంతమంది ఆడపిల్లలలో ధైర్యం చేసి అమ్మ నన్ను కళాశాలలో చేర్పించింది. మొట్టమొదటి అమ్మాయిగా నేను ఊరు దాటి పట్నం వచ్చేశాను. 1971వ సంవత్సరంలో నేను, నా స్నేహితురాలు ఇంటర్‌లో చేరాము. ఆ స్నేహితురాలు కూడా ఇంటర్ తర్వాత వివాహం చేసికున్నది. నేను నా చదువును మాత్రం ఆపలేదు. ఇది ఒక ఉదాహరణమాత్రమే. అంటే వందల మంది అమ్మాయిలలో ఒక్క అమ్మాయి తన గమ్యాన్ని చేరుకున్నది అంటే అప్పటి కాలంలో స్త్రీ విద్య ఎలా ఉండేదో ఊహించుకోండి. ఉపాధి విషయానికి వస్తే మా అమ్మగారు విపరీతమైన కృషిచేసి తన మహిళా మండలికి ఒక స్వంత భవనాన్ని సాంక్షన్ చేయించుకున్నారు. అనుసంధానంగా ఒక బాల్వాడీ దానికి శిక్షణ పొందిన ఒక టీచరు. స్త్రీలకు కుట్టుశిక్షణ, అల్లికల కోసం ఒక కుట్టు టీచరు మరియు అమ్మకు ఒక సహాయకురాలు ఉండేవారు. అమ్మ కష్టపడి 200మంది స్త్రీలను సభ్యులుగా చేర్పింది. నవోదయ మహిళామండలి అని నామకరణం చేసి రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ సమయంలో నేను 8వ తరగతిలో ఉన్నాను.

1966లో శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత స్త్రీ సంక్షేమము ఊపందుకున్నది. నిధులు ధారాళంగా మంజూరు అయ్యేవి. ఇంతలో మా అమ్మ కూడా మహిళా మండలి అధ్యక్ష స్థాయి నుండి పంచాయతి సమితి సభ్యురాలిగా ఎదిగింది. సమస్యలను ఏకరువు పెట్టి శిక్షణ పొందిన స్త్రీలందరికీ ఉచితంగా కుట్టుమిషన్లు ఇప్పించింది. 1976`1985 దశాబ్దమును అంతర్జాతీయ మహిళా దశాబ్దంగా గుర్తించారు. 1975వ సంవత్సరంలో నవంబరు 19న శ్రీమతి ఇందిరా గాంధీగారు తన జన్మదినాన్ని హైదారాబాదులో జరుపుకున్నారు. మమ్మల్ని కాలేజీ నుండి ఉచిత బస్సులో పబ్లిక్ గార్డెన్స్‌కు తీసికెళ్ళారు. 20 జిల్లాల నుండి మహిళలు, కాలేజీ విద్యార్థినులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. తమాషా విషయం ఏమిటంటే అమ్మ, నేను ఇద్దరం

ఆ మీటింగులో పాల్గొన్నాము. మా ఇద్దరికీ మేము ఒకరికి ఒకరు అక్కడ ఉన్నట్టు తెలియదు. 15 రోజుల తర్వాత సెలవులకు ఊరు వెళ్ళినప్పుడు ఈ ప్రస్తావన వచ్చింది. ఆ నాటి సమాచార వ్యవస్థకిది నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార సంస్థ 1975లో ఏర్పడ్డది. ఫలితంగా ఇబ్రహీం పట్నంలో మహిళా సూపర్‌బజారు వెలిసింది. అమ్మ దానికి డైరెక్టరు. అందరూ మహిళలే. బియ్యం, పప్పు దినుసులు, మసాలాలు, పొడులు లాంటివి శుభ్రంచేసి చక్కగా ప్యాక్ చేసేవారు. దీనికి విపరీతమైన ప్రచారం లభించింది. లాభాలను గడిరచింది.

1976లో నా వివాహము జరిగింది. మా ఊరి నుండి పెద్ద సమాచారం ప్రత్యక్షంగా లేదు. ఉత్తరాల ద్వారా అమ్మ అక్కడి విశేషాలను తెలిపేది. తర్వాతికాలంలో బాలికల విద్యకు ప్రాధాన్యం పెరిగింది. బాలికలు పెద్ద సంఖ్యలో చదువును అభ్యసించారు. 1980లో ఇబ్రహీంపట్నంలో జూనియర్ కాలేజీ ప్రారంభం అయింది. అక్కడి అమ్మాయిలకు వేరేచోటికి వెళ్ళవలసిన పనిలేదు. ఇప్పుడు ఇబ్రహీం పట్నం పరిసర ప్రాంతాలలో 40 కాలేజీలు ఉన్నాయి. 2018 సంవత్సరంలో జరిపిన సర్వే ప్రకారము మహిళా అక్షరాస్యత 65.79 శాతానికి పెరిగింది. 9వ ప్రణాళికలో 30% నిధులు మహిళా సంక్షేమం కోసం కేటాయించారు. 9 మార్చి 2010లో రాజ్యసభలో మహిళా బిల్లు ఆమోదపరచబడిరది. సమాన వేతన బిల్లు కూడా ఆమోదింపబడిరది. ఇప్పుడు వృద్ధ మహిళలకు ఆసరా పింఛన్లు అందిస్తున్నారు. మహిళలకు కుటీర పరిశ్రమల స్థాపనకు, స్వయం ఉపాధి పథకాలకు లోన్లను అందిస్తున్నారు. మహిళలు అన్ని రంగాలలోనూ ముందున్నారు.

ఇక చట్టసభల విషయానికి వస్తే పార్లమెంటులో 78మంది మహిళా ఎంపిలు ఉన్నారు. ఇది 14% (శాతమే). నా దృష్టిలో ఇది ఇంకా తక్కువే. మొదటి మహిళా గవర్నరుగా శ్రీమతి సరోజినీ నాయుడు పనిచేశారు. 1963లో శ్రీమతి సుచేతా కృపలానీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. (మొట్టమొదటి మహిళా ముఖ్యమంత్రి).

1972సంవత్సరంలో శ్రీమతి కిరణ్ బేడీగారు మొట్టమొదటి మహిళా ఐ.పి.ఎస్.ఆఫీసర్. పదవీ బాధ్యత స్వీకరించారు. ఈమెకు ఈమెయే సాటి. 1989లో శ్రీమతి కిరణ్‌బేడి గారి నుండి వ్యాస రచన పోటీలో బహుమతిని, ప్రశంసా పత్రాన్ని అందుకున్నాను. రిట్జ్ హోటల్ (Rఱ్‌ఓ నోశ్‌వశ్రీ) హైదరాబాదులో ఆమెతో కలిసి ఆతిథ్యాన్ని స్వీకరించిన జ్ఞాపకం ఇప్పటికీ మదిలో మెదలుతుంది. మళ్ళీ రెండవసారి పాండిచ్చేరీలో 2018 డిసెంబరులో రాజ్‌నివాస్‌లో కలిసాము. ఆప్యాయంగా పలుకరించి, తన ఇల్లంతా తన సెక్రటరీలో చూపించారు. ఆమె ప్రజల మనిషి. ఇప్పుడు మహిళలు మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా రాజకీయరంగంలో రాణిస్తున్నారు. యుద్ధ విమానాలను నడుపుతున్నారు. పోలీస్ ఆఫీసర్లుగా తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీగారు బేటీ బచావో ` బేటీ పఢావో నినాదంలో ముందుకు వెళుతున్నారు. కాని ఇంకా బేటీబచావో మాత్రం నూరుశాతం జరగడం లేదు. 1994లో లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టం తెచ్చినా కూడా ఇంకా భ్రూణ హత్యలు జరుగుతున్నాయి. ఆడశిశువులను రోడ్లపై వదలి వేస్తున్నారు. ఇవి చదివినపుడు విపరీతమైన బాధ కల్గుతుంది. మహిళా నవశ్రీజా శ్రీఱఅవ అబఎపవతీ గర్భిణులకు ప్రత్యేక సలహాలు ` 102, బాలలకు 24/7 ంశీశ్రీశ్రీ ఫ్రీతీవవ ` 1098 అన్నీ అమలులోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్త్రీ, శిశు సంక్షేమాలకు విపరీతంగా కృషిచేస్తున్నాయి. భద్రత విషయానికి వస్తే నిర్భయ, దిశ చట్టాలు తెచ్చినా స్త్రీలకు ఇంకా భద్రత లేదు. ఒంటరిగా రాత్రిపూట తిరుగులేని పరిస్థితి. రోజూ పేపర్లలో అత్యాచార ఘటనలే. ూాష్ట్రవ ఎవaఎం ఏర్పాటుచేసినా, ూaసవ జaప ఇతీఱఅజవతీం ను ఏర్పాటుచే-

సినా, ఆశించిన ఫలితం లేదు. అన్ని రంగాలలో ముందంజ వేసినా, భారతదేశంలో మహిళలకు భద్రత లేదు. పనిచేసే చోట లైంగిక వేధింపులు ఎక్కువైపోయాయి. గృహహింస చట్టం 2005లో వచ్చింది. అయినా ఇంకా మనం గృహ హింసకు లోనైన స్త్రీల బాధలు చూస్తూనే ఉన్నాము.

భారతదేశపు మహిళలు ఇపుడు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, కళాసాంస్కృతిక, సేవా విభాగాలలో, విజ్ఞానశాస్త్ర, సాంకేతిక నిపుణతలో మరియు రక్షణశాఖలోనూ పాల్గొంటున్నారు. భారతీయ మహిళలందరికీ సమానత్వం (నిబంధన 14), వివక్ష లేకుండుట (నిబంధన 15 (1) ), సమానావకాశాలు కల్పించడం (నిబంధన 16), పనికి సమాన వేతనం (నిబంధన 39 డి ), మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ఆచారాలు లేకుండా చేయడం (నిబంధన 51(ఎ)(ఇ)), ప్రసూతి సమయంలో ఉపశమనానికి (నిబంధన 42), మహిళా రిజర్వేషన్ 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం సదుపాయాలను అనుమతించటం వంటి హామీలను భారత రాజ్యాంగం కలిపించింది. ఆడ శిశువుల హత్యల, లింగ వివక్ష, స్త్రీ ఆరోగ్యం మరియు మహిళా అక్షరాస్యత వంటి అంశాలలో స్త్రీ వాద ఉద్యమదారులు కలిసికట్టుగా పనిచేస్తున్నారు. భారతీయ స్త్రీలపై భర్తలు మద్యపానం సేవించడం ద్వారా జరిగే హింసాత్మక ఘటనలు అరికట్టడానికి మహిళా సమూహాలు మద్యపాన వ్యతిరేక ఉద్యమాలు ప్రారం భించాయి. ముఖ్యంగా మహిళలకు ఎక్కడైతే రక్షణ కొరవడిరదో, హింసకు గురి అవుతుందో అక్కడి నుండే న్యాయపోరాటం జరిగే విధంగా గృహహింస నిరోధక చట్టం ఏర్పడిరది. ఈ విషయాలన్నీ నేను స్వాతంత్య్రం వచ్చిన ఈ 75 సంవత్సరాలలో గమనించిన విషయాలు. మొదటి ముప్పది సంవత్సరాలు చాలా జటిలమయినవి. తరువాతనే అభివృద్ధి పథంలో అడుగుపెట్టాము.

ప్రాచీన కాలంలో పురుషులతో సమానస్థాయిలో ఉన్న భారతీయ మహిళలు మధ్య యుగంలో అధమ స్థాయికి అణచ బడటం, అనేకమంది సంఘ సంస్కర్తలు తిరిగి వారికి సమాన హక్కుల కోసం కృషిచేయడం, ఆధునిక భారతదేశంలో తిరిగి మన ఉనికిని చాటుకోవటం `ఇదీ మన సాధికారత.

మన దేశ ఆర్థిక ప్రగతిలో స్త్రీల పాత్ర : ఉపాధి రంగాలలో మహిళలు ముందంజలో ఉన్నారు. పారిశ్రామిక రంగంలో కిరణ్ మజుందార్‌షా, ఇంద్రానూయి లాంటి మహిళలు ఎంతో పేరు గడిరచారు. మన మొత్తం GDP (Gross Domestic Product) జాతీయ సగటు ఆదాయంలో 17`18% వరకు స్త్రీలే భాగస్వాములుగా ఉన్నారు. మన దేశ జనాభాలో 25% మహిళలు పనిచేస్తున్నారు. కనీసం 50% మహిళలకైనా పని ఇప్పించ కలగాలి. ఇప్పటికి గ్రామీణ ప్రాంతాల నుండి 25,000 మంది మహిళలు స్వంత వ్యాపారాలను నిర్వహించుకుంటున్నారు. మన ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో అనేక కొత్త పథకాలు అమలులోకి వస్తున్నాయి.

నారీ శక్తి పురస్కార్ : కేంద్ర ప్రభుత్వంవారు మహిళా సంక్షేమ శాఖాభివృద్ధి శాఖ నుండి ఆయా రంగాలలో అసమాన ప్రతిభను కనబరచిన 20మంది మహిళలకు నారీ శక్తి పురస్కార్‌తో సన్మానిస్తున్నారు. ఇది 1999వ సం॥ నుండి ప్రారంభమయింది. ఇంతకుముందు దీనిని స్త్రీ శక్తి పురస్కార్ అనేవారు. ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఈ అవార్డును అందజేస్తారు.

బేటీబచావో ` బేటీ పఢావో కార్యక్రమం:

సంబరాలు జరుపుకుని 5 మొక్కలు నాటాలన్నారు. ఆడబిడ్డలందరి చక్కగా చదివించాలన్నారు. తద్వారా ఉన్నత విద్యావకాశాలు, మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తోడ్పడుతాయి. పూర్వకాలంలో మాదిరిగా స్త్రీలు తమ తండ్రులు, భర్తల మీద ఆధారపడకుండా స్వయం ప్రతిపత్తితో ఆత్మ నిర్భర్ భారత్‌వైపు ప్రయాణిస్తారు.

జైహింద్

# నవవిధ భక్తిమార్గాల్లో చివరిది



# ఆత్మనివేదనం

ఆదూరి హైమవతి

"బామ్మా బామ్మా! త్వరగా వచ్చేసి తొమ్మిదో కథ చెప్పేయి. నాస్నేహితులకు చెప్పాలి" అంటూ వచ్చి బామ్మ దగ్గర కూర్చుంది కుమారి. కార్తీక మాసానికని వత్తులు చేసుకుంటున్న బామ్మ చిరునవ్వుతో.

"రా! బంగారు తల్లీ! చెప్తాను. విను" అంటూ మొదలు పెట్టింది.

మనం చెప్పుకుంటున్న నవవిధ భక్తిమార్గాల్లో చివరిదిదైన 'ఆత్మ నివేదనం 'అంటే మనోవాక్కాయ కర్మలతో తనను తాను భగవంతునికి అర్పించుకొడం అన్నమాట. అర్పించుకోడం అంటే మనసంతా ఆ భగవంతునికి అర్పించి నిరంతరం భగవత్ ధ్యానంతో అన్ని పనులూ చేసుకుంటున్నా ఆయనను మనస్సులో స్మరిస్తూ ఉండటం.

సరే, అనగా అనగా అనంతవరం అనే గ్రామం పక్కనే ఉన్న చిన్నపాటి అడవిలో ఒక పురాతన అన్నపూర్ణమ్మతల్లి ఆలయం ఉండేది. ఆ ఆలయంలో పరమ శివుని లింగం ఉన్నా, అంతా అమ్మకే ఎక్కువగా మొక్కుకునేవారు. అన్నపూర్ణమ్మ కనుక తమకు తిండీ తిప్పలకు కరువు ఉండదని జనం భావించేవారు. అలా ఆ ఆలయకీర్తి చుట్టుపక్కల పరగణాలకు వ్యాపించింది. అంతా బండ్లుకట్టుకుని వచ్చి అమ్మనుపూజించి అక్కడే చెట్ల-క్రింద భోజనాలు వండుకుతిని సాయంకాలానికి వెళ్లేవారు. ఆ అలయ పూజారి సుదర్శనయ్య భార్య సుందరమ్మ అన్నపూర్ణమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తూ ఉండేది. ఇరువురూ దేవతల పూజలో పునీతులై నిరంతరం దైవ ధ్యానంలో గడిపేవారు. భక్తులు సమర్పించుకునే దక్షిణ, పూజా ద్రవ్యాలు, కొబ్బరికా-



యలూ, పండ్లూ ఫలాలతో వారి బత్తెం గడచిపోయేది. ఆలయం పక్కనే చిన్న గుడిసె వేసుకుని నివసించేవారు. వారికి ఆలయ పూజ దైవస్మరణ తప్ప మరే ధ్యాసా లేదు. ఇలా ఉండగా ఒకమారు విపరీతమైన కరవు వచ్చి, వానల్లేక జనాలకు తిండే కరువైపోయింది. ఎవ్వరూ ఆలయానికేసి వచ్చినవారేలేరు. పూజారి దంపతులకు ఏం చేయాలో పాలుపోలేదు. అమ్మకు, అయ్యవారికీ నైవేద్యం పెట్టను ఏమీ లేక చాలా బాధ పడసాగారు. చుట్టుపక్కల అడవుల్లో లభ్యమయ్యే కాయలు, పండ్లూ, పూలూ తెచ్చి ఎలాగో పూజాదికాలు నైవేద్యాలూ చేసి, విచారంగా జీవించసాగారు. పూర్వం అంగరంగవైభోగంగా ఉండే దేవాలయం ఇలా నిర్మానుష్యంగా ఉండటం,తమకూ అమ్మ, అయ్యవారల శేష వస్త్రాలు లేక చిరిగి చీర, పంచలనే కుట్టుకుని కట్టుకున్నా తమ గురించీ కాక ఆలయానికి ఇలా సందడిలేక సందర్శకులు లేక ఉండటం వారిని చాలా బాధించింది .

నిత్యం ఆలయం లో దేవుని ముందుకూర్చుని ఇరువురూ కంటికి కడివెడుగా దుఃఖిస్తూ "అమ్మా మావల్ల అపరాధం జరిగితే మన్నించు. వర్షం వచ్చి జనం సుఖ సంతోషాలతో కడుపునిండా తింటూ పూర్వంలా ఆలయానికి వచ్చి మిమ్ము సేవించుకునేలాగా చేయ్యండి తల్లీ!' అనిమనస్సులో స్మరిస్తూ అడవిలో దొరికే కాయా పండూ, దుంపా నైవేద్యం పెట్టి అదే భుజిస్తూ జీవమున్న కర్రల్లా సన్నబడిపోయి దిగులుతో కృశించిపోయారు.

వారు ఒక నిర్ణయానికి వచ్చారు. వర్షం వచ్చే వరకూ నిరాహారంగా ఉపవశిస్తూ, కేవలం శివునికీ అమ్మకూ అభిషేకించిన జలం మాత్రమే త్రాగాలని నిశ్చయించుకున్నారు. అలా చేయడం ప్రారంభించారు కూడా. ఒక మాసం అయ్యేసరికి వారు ఇంకా చిక్కి శల్యించిపోయి కదిలే శక్తికూడాలేకుండా పోయింది. ఆరోజు రాత్రి చీకటి కమ్మి నీలమేఘాలు చిక్కని మబ్బులు వచ్చి కుండపోతగా వర్షం కురిసి ఊరూ వాడా నీటితో నిండిపోయాయి.

అలా మూడు పగళ్ళూ మూడు రాత్రూలూ వర్షం కురిసి నదులూ చెరులూ పొర్లి పారాయి. జనమంతా వాన తగ్గగానే ఆలయ దర్శనానికి రాగా అక్కడ స్పృహలేకుండా దేవునిముందు పడివున్న పూజారి దంపతులను చూసి వారి చేతుల్లో ఉన్న ఉద్ధరిణలను చూసి, జరిగింది గ్రహించారు. వారిరువురినీ మంటపంలో పడుకోబెట్టి కొద్దిగా పాలు నోట్లో పోస్తూ సేవచేసాక మూడు రోజులకు వారు కదిలారు.

గర్భగుడి నుండి వారికి ఒక స్వరం వినిపించింది. "భక్తులారా! మీకు మూడు సంవత్సరాలు కరువు కాటకాలు ఉన్నాయి. ఐతే ఈ పుణ్య దంపతుల భక్తి వారు మాకోసమే కాక మీ అందరికోసం తపించి తమను తాము అర్పించుకున్నందున వర్షం కురిసింది'. ఆ స్వరం విని అంతా పూజారి దంపతులకు భక్తితో నమస్కరించి వారికి సదుపాయాలన్ని చేశారు. తిరిగి ఆలయం పూర్వస్థితికి వచ్చి నిత్యకల్యాణం పచ్చతోరణంగా చాలా కాలం వెలుగొందింది. ఇదమ్మా కుమారీ ఆత్మనివేదనం అంటే.'

"బామ్మా నాకు బాగా అర్థమైంది. ఎవరైతే తమకోసం కాక జనులందరి కోసం నిస్వార్థంగా ప్రార్థిస్తారో వారి కోరికను భగవంతుడు తప్పక వింటాడు., అని" ఓకే బామ్మా! నాకు నవవిధ భక్తిమార్గాలను గురించీ చక్కగా చెప్పావు. ఇహ మా జట్టుదే గెలుపు. థ్యాంక్యూ " అంటూ పరుగు లంఘించుకుంది కుమారి.

***

# స్వాతంత్ర్యోద్యమ విస్ఫూర్తి – చిలకమర్తి



చిలకమర్తి దుర్గాప్రసాదరావు

మనందరం నివసిస్తున్న ఈ భూమిపట్ల మాతృభావన మనకు వేదకాలం నుంచి ఉంది. ఆ నాటి మానవుడు "మాతా భూమి: పుత్రో஽హం పృథివ్యా:" అని తనకు భూమిలో గల సంబంధాన్ని మాతృపుత్రసంబంధంగా చాటుకున్నాడు. ఇక ఇతిహాసకాలం నాటి మానవుడు మరో అడుగు ముందుకెళ్ళి కన్నతల్లి, ఉన్ననేల స్వర్గంకన్న మిన్నగా భావించాడు. రావణసంహారం పూర్తయింది. రాముడు సైన్యసమేతంగా అయోధ్యకు తిరిగి రానున్నాడు. ఆసమయంలో లక్ష్మణుడు రామునితో " అన్నయ్యా ! మనం ఈ లంకారాజ్యంలోనే ఉండిపోదాం. ఇది చాల బాగుంది" అన్నప్పుడు రాముడు చెప్పిన మాటలు ఒక వ్యక్తికి తన మాతృభూమి పట్ల ఉండవలసిన ఆదర గౌరవాల్ని జ్ఞాపకం చేస్తున్నాయి. ఓలక్ష్మణ! ఈ లంకానగరం సర్వాంగసుందరమైన బంగారు భూమియే ఐనప్పటికీ నేను ఇష్టపడను. ఎందుకంటే జనని, జన్మభూమి స్వర్గం కన్నా గొప్పవి.

ఆపి స్వర్ణమయీ లంకా న మే లక్ష్మణ రోచతే

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ.

ఈ విధంగా మనకు భూమితోనూ అందులోనూ మాతృభూమితోను గల సంబంధం చాల గాఢమైనది. అందువల్ల తమ మాతృదేశం దాస్యశృంఖలాల్లో చిక్కుకున్నప్పుడు ఆమె విముక్తి కోసం తను,మన,ధన,ప్రాణాలర్పించిన మహానుభావులెంతమందో ఉన్నారు. వారు ముల్లోకాల్లోను పూజింపబడుతూనే ఉంటారు. ఎందుకంటే –


'స్వాతంత్ర్యమ్మునకై తెగించి తన సర్వస్వమ్ముగోల్పోవు నే

పూతాత్ముండతడొక్కడే త్రిభువనీపూజ్యుండు'

అంటారు ప్రముఖ కవి కీ||శే|| శ్రీ యేటుకూరి వేంకట నరసయ్య గారు. దీన్నిబట్టి ఎవడు త్రికరణశుద్ధిగా మాతృదేశంకోసం తన సర్వస్వాన్ని సమర్పిస్తాడో అట్టివాడు ముల్లోకాల్లోను గౌరవింపబడతాడు.

మనదేశం ఆంగ్లేయుల ఉక్కుపాదాలక్రింద నలిగి ఎన్నో బాధ-

లనుభవించింది. ఆమె దాస్యవిమోచనకు ఎంతోమంది ఎన్నెన్నో త్యాగాలు చేశారు. మహాత్ముని నాయకత్వంలో ఆసేతు హిమాచలం కులమతజాతిప్రాంతీయభేదం లేకుండా ఆయన వెంట నడిచింది. అహింసాయుతపోరాటం జరిపి ఆంగ్లేయులను తరిమి తరిమి కొట్టింది. ఆ పోరాటంలో ఒక్కొక్కరు ఒక్కొక్క మార్గం ఎంచుకున్నారు. కొంతమంది సత్యాగ్రహాన్ని ఎన్నుకుంటే మరికొంతమంది ప్రజల్లో జాతీయభావాలు రేకెత్తిస్తూ కర్తవ్యాన్ని ప్రబోధించే సాహిత్యాన్ని ఎన్నుకున్నారు. మార్గాలు వేరైనా లక్ష్యం ఒక్కటే. అదే స్వాతంత్ర్యసాధన . అటువంటి సాహిత్యదళపతులలో బ్రిటీషు వారినెదిరించిన మొట్టమొదటివ్యక్తిగా శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారి పేరు భారతస్వాతంత్ర్యచరిత్రపుటలలో వ్రాయబడి ఉంది. ఆయన కేవలం స్వాతంత్ర్యసమరయోధునిగానే కాక కవిగా, ప్రముఖపాత్రికేయునిగా, గ్రంథాలయోద్యమనాయకునిగా, సంఘసంస్కర్తగా ఎన్నో సేవలందించారు.




చిలకమర్తివారి పూర్వీకులు ప్రకాశంజిల్లా మద్దిపాడు గ్రామానికి చెందినవారైనప్పటికీ కొన్ని కారణాలవల్ల వలసవచ్చి పశ్చిమ గోదావరిజిల్లా వీరవాసరంలో స్థిరపడ్డారు. శ్రీచిలకమర్తి 1867 సెప్టెంబర్ 26 వ తేదీన తణుకు తాలూకాలోని ఖండవల్లి గ్రామంలో జన్మించారు. ఈస్టిండియా కంపెనీవారు వీరవాసరంలో స్థాపించిన ఆంగ్లపాఠశాలలో చదువు ప్రారంభించారు. వీరవాసరంలో నాల్గవ తరగతివరకు మాత్రమే ఉండడంవల్ల నరసాపురం మిషన్ హై స్కూల్లో పైచదువు కొనసాగించారు. 1887 లో మెట్రిక్ లో ఉత్తీర్ణులై కొంతకాలం రాజమహేంద్రవరంలో అధ్యాపకునిగా పని చేశారు. అప్పుడే అక్కడే శ్రీకందుకూరి వీరేశలింగం గారికి శిష్యులయ్యారు. ఎన్నో కావ్యాలు , నాటకాలు , నవలలు , చారిత్రక నవలలు రచించారు. వీరు రచించిన ‘ గయోపాఖ్యానం’ నాటకం ఎంతో ప్రజాదరణ పొంది ఆనాడే ఒక లక్షపుస్తకాలు అమ్ముడు పోవడం ఒక విశేషం .

1909 లో నిమ్నజాతులకు పాఠశాలను స్థాపించారు. వందలకొలది నిమ్నజాతులవారికి, స్త్రీలకు ఉచితంగా విద్యనందించారు. బ్రహ్మసమాజం, హితకారిణి మొ॥సంస్థల ద్వారా సమాజసేవలందించారు. 'సరస్వతి', 'మనోరమ', 'దేశమాత' మున్నగు పత్రికలను నడిపి జాతీయోద్యమాన్ని బలోపేతం చేశారు. వారి సర్వతోముఖమైన సేవలకు గుర్తింపుగా ఆంధ్రవిశ్వవిద్యాలయం 1943లో వారికి 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సత్కరించింది. వీరు అంధులైనప్పటికి ఇంతటి మహోన్నత స్థానాన్ని పొందగలగడం ఒక విశేషం వీరు 1946 జూన్ 7 వ తేదిన మరణించారు.

ఈ వ్యాసంలో శ్రీ చిలకమర్తి అందించిన స్వాతంత్ర్యోద్యమస్ఫూర్తికవితలను గురించి సంగ్రహంగా తెలుసుకుందాం . అవి ఆంగ్లేయులు మన దేశాన్ని పరిపాలిస్తున్న రోజులు. 1907 లో శ్రీ బిపిన్ చంద్రపాల్ దక్షిణభారతదేశంలో పర్యటిస్తూ తన మహోపన్యాసమహాప్రభంజనంతో ప్రజలలో అచంచలమైన జాతీయస్ఫూర్తిని రేకెత్తిస్తున్నారు. ఆయన బరంపురం మీదుగా రాజమహేంద్రవరం చేరుకొని 19-4-1907 నుండి 24-4-1907 వఱకు ఐదు రోజులపాటు తెలుగుప్రజల నుద్దేశించి గంభీరంగా ఉపన్యసించారు. వారి ఆంగ్లప్రసంగాలను తెలుగులో అనువదించడానికి నియమితులైన శ్రీ చిలకమర్తి చివరిరోజున ఆశువుగా చెప్పిన చైతన్యగీతానికి తెలుగుజాతి యావత్తు ఉత్తేజం పొందినదనడంలో ఎటువంటి సందేహం లేదు .

భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చు చుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకు చున్నారు మూతులు బిగియగట్టి

అనే పద్యంలో ఆంగ్లేయులను దోపిడిదారులగాను, భారతీయులను దోపిడీకి గురౌతున్నవారిగాను వర్ణించిన తీరు ఎంతో స్ఫూర్తి దాయకం అయింది . దేశభక్తుడు కష్టాలను లెక్కచెయ్యకూడదని ప్రబోధించే ఈ పద్యం మఱింత స్ఫూర్తి దాయకం.

చెఱసాలల్ పృథు చంద్రశాలలె యగున్ చేదోయి సంధించు న
య్యరదండల్ విరిదండలౌను కడు హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు మోటు కంబళులు తాల్పన్ పట్టుసెల్లాలగున్
స్థిరుడై యేనరుడాత్మదేశమును భక్తింగొల్చు నవ్వానికిన్

దేశభక్తునికి  చెఱసాలలు పాలరాతిమేడలౌతాయట. సంకెళ్ళు పూలదండలౌతాయట. గంజే పరమాన్న-మౌతుందట. మోటైన కంబళ్లే పట్టువస్త్రాలౌతాయట. ఎంత రమణీయమైన భావన ఇది .  అలాగే దాస్య-శృంఖలాల్లో చిక్కుకొని అలమటిస్తున్న సమస్తదేశాన్ని ఒక బదిఖానగా  అభివర్ణించిన తీరు పరమరమణీ-యం.

భరతఖండంబె ఒక పెద్ద బందిఖాన
అందులోనున్న ఖైదీలు హిందుజనులు
ఒక్క గదినుండి మార్చి వేఱొక్క గదికి
పెట్టుటే గాక చెఱ యంచు వేఱె గలదే

అంతేగాక స్వాతంత్ర్యమనేది యాచనవల్ల సాధించేది  కాదని అది త్యాగాలవల్ల మాత్రమే సాధ్యమౌతుందని నొక్కి చెప్పే ఈ క్రింది పద్యం ఉద్యమకారులందరికి స్ఫూర్తి దాయకం .

ఎందఱు కుందకుండ మఱి యెందఱు బందెలకందకుండ నిం
కెందఱు దేశముల్  విడిచి  యీడిగలంబడకుండ  నెవ్వరే
చందమునన్ శ్రమంబడక చప్పున చొప్పడునే స్వరాజ్యమో
హైందవులార ! చింతిలకుడీ చెఱసాలలకేగుమన్నచో

ఈ విధంగా ఆనాడు ఉద్యమస్ఫూర్తిని రేకెత్తించిన ఎన్నెన్నో కవితలు వీరి కలం నుంచి జాలువారాయి. అలాగే ఆనాడు తమ కవితలతో ప్రజలలో జాతీయభావాలను రేకెత్తించిన వారిలో శ్రీయుతులు రాయప్రోలు, విశ్వ-నాథ, జాషువ, కరుణశ్రీ, యేటుకూరి, తుమ్మల, మధునాపంతుల , త్రిపురనేని , దాశరథి  మొదలగువారే గాక మరెందఱో ఉన్నారు . నేటి   యువత వారి కవితలను చదివి, స్ఫూర్తి పొంది, దేశాన్ని ప్రగతిపథం వైపు నడిపించి, దేశం యొక్క పూర్వవైభవాన్ని తిరిగి సాధించాలని ఆశిద్దాం .

# మా ఊరి నందుల ఆత్మీయ కథ



## నందుల ప్రభాకర శాస్త్రి

(గత సంచిక తరువాయి)

భాకరాపేట గ్రామానికి మంచి జరిగినా చెడు జరిగినా సగం పాత్ర తప్పకుండ రాయిపెద్ది వెంకటరమణయ్య గారిదే. ఊరికి పెద్దమనిషి, పంచాయితీలు చెప్పడం, ఊర్లో శనక్కాయల వ్యాపారం చేయటం ఇలా ఆయన పాత్ర చాలా వుండేది. చాలా కాలం పాటు నందులవారి కుటుంబానికి రాయిపెద్ది వారి కుటుంబానికి వైరాలు లేకపోయినప్పటికీ ఎక్కడో అంతరాల్లో అనుమానాలు అవమానాలు మిగిలిపోయుండేవి. అవి ఆరిపోకుండా ఊర్లోవాళ్ళు రాజేస్తూ తమ పనిని గడుపుకునేవారు.

వెంకటరమణయ్యకు ఒకే ఒక కుమారుడు శేషయ్య. శేషయ్యకు ఒక కుమార్తె పుట్టిన తరువాత చాలాకాలం సంతానం కలుగలేదు. మా ఇంట్లో ఏడు మంది పిల్లలు పుట్టి పెరుగుతూ వుంటే ఎక్కడో ఆయనకు పగతో కూడిన ప్రేమో.. ప్రేమతో కూడిన అసూయనో తొలుస్తూ వుండేది. నేను అయిదారు తరగతులు చదివేటప్పుడు ఒకరోజు సత్రం అరుగు మీద కూర్చుని వుంటే ఆయన ప్రక్కన వచ్చి కూర్చుని నన్ను తొడ మీద పండబెట్టుకుని జుట్టు నిమురుతున్నాడు.

మా రెండవ అన్నయ్య సుబ్రమణ్యమన్న ఇది చూసి, "ఒరేయ్... ఆయనది ధృతరాష్ట్ర ప్రేమరా! ధృతరాష్ట్ర కౌగిలిలో ఇరుక్కోవాకు" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ మాట విన్న వెంకటరమణయ్య "ఓయ్ నాయాల... ఎంత మాటన్నావోయ్!" అని నొచ్చుకుని వెళ్ళిపోయాడు.

రెండు, మూడు రోజులకొకసారి సాయంత్రం మా ఇంటికి వచ్చి, అమ్మ చేత నీళ్లు ఇప్పించుకుని ఆరుబయట అరుగు మీద కూర్చుని త్రాగి వెళ్లిపోయేవాడు. చివరిసారిగా ఆయన్ను కలిశాను. అప్పటికే తొంభై పైన పడిన మనిషి. "మామా... ఎలా ఉన్నారు" అని అడిగితే, "నాకేం వోయ్ ... బాగున్నా. సర్వాంగాలు పనిచేస్తున్నై. ఒక్క కళ్ళు తప్ప..." అన్నాడు. మంచి రసికుడు. నాలుగైదు గడపలు ఎక్కి దిగేవాడు. ఆ తర్వాత ఎప్పుడో కాలం చేశాడు.

పాత తరం వారు ఒక్కొక్కరే కనుమరుగవుతున్నారు. అమ్మ.. నాన్న.. అదే కుటీరంలో వచ్చినవాళ్ళకు ఆతిథ్యం ఇస్తూ ... ఆశ్రమవాసం గడిపేవారు. ఆనుకోకుండా మా నాన్నగారి పెద్ద భార్య తమ్ముడు డాక్టర్ రాఘవయ్య గారు మా నాన్నగారిని చూడటానికి వచ్చారు. ఆయనకు తొమ్మిది మంది పిల్లలు. ఈయనకు ఏడుమంది పిల్లలు. ఇద్దరూ మహదానందపడి నాకు వాళ్ళ పెద్దమ్మాయి శశికళను, వాళ్ళ పెద్దబ్బాయి రామచంద్రమూర్తికి మా రెండవ చెల్లెలును ఇచ్చి వివాహం చేసుకునేటట్లు నిశ్చయించుకున్నారు.

నేను ఉద్యోగరీత్యా.. 'లాతూరు'కు కుటుంబంతో సహా వెళ్ళిపోయాను. చిన్న చెల్లెలును పొద్దుటూరులో పెద్దమ్మణ్ణి విజయమ్మ ఇంట్లో వుంచి పదవ తరగతి చదివించటానికి ఏర్పాట్లు జరిగిపోయాయి.

## యోగిని సుబ్బమ్మ

రెండేండ్లు గడిచాయి. అన్నీ బాగున్నాయనుకున్న సమయంలో నాన్నకు 'పక్షవాతం' రావటం... ఎక్కడ ఉండాలన్న ప్రశ్న ఉద్భవించటం.. తమ్ముడు రవీంద్ర శర్మ చెల్లెలు గాయత్రీ, వీరంతా



ఎక్కడ ఎలా వుండాలన్న ఆలోచన రాగానే.. "మనమెందుకు స్కూలు పెట్టకూడదూ?" అన్న ఆలోచన వచ్చి, లాతూరులో ఎల్. ఎల్. బి. పూర్తి చేసి ప్రాక్టీసు పెడదామనుకున్న నేను గిద్దలూరులో స్కూలు ప్రారంభించాను. అమ్మ, నాన్న చెల్లి, నేను, నా భార్య, ముగ్గురు పిల్లలు... ఈ విషయాలన్నీ తరువాత వివరిస్తా. నాలుగేళ్లు నాన్నగారు బాగానే తిరుగుతూ వుండేవారు. తరువాత స్వర్గస్తులైనారు. అమ్మ ఒంటరిదైపోయింది. ఎవరు పిలిస్తే వారింట్లో వుండేది. తనకంటూ ఒక గుడ్డ సంచీ రెండు చీరలూ.. షోలాపూర్ దుప్పటీ ... ఇవే ఆమె వస్తువులు. ఒక చీర 'మడుగు'కు ఆరేసుకుంటే.. మరొక చీర కట్టుకునేది. ఒక్క క్షణం కూడా విశ్రాంతి లేకుండా ఏదో ఒక పని చేస్తూ ఉండేది. ఆమె కుమారులు, కుమార్తెలు ఎవరి దగ్గర వుంటే వాళ్ళ దగ్గర అన్ని పనులు చేసిపెట్టేది. ఎక్కువగా స్కూలు ఉండడం వల్ల, చిన్న తమ్ముడు రవీంద్ర గాయత్రి లకు తోడుగా అమ్మ ఉండేది. పెద్దన్న గానీ, ఎవరైనా వచ్చి ఊరెళ్ళేటప్పుడు డబ్బులిస్తే, అవన్నీ పదిరూపాయల నోట్లుగా మార్చి పిల్లలందరికీ పంచిపెట్టేది. డబ్బును తన దగ్గర వుంచుకునేది కాదు. చివరగా మిగిలిన బంగారు కమ్మలు గాయత్రికి ఇచ్చివేసింది.

నాన్న చనిపోయిన తర్వాత ఒక్కపూట మాత్రమే భోంచేసేది. ఉదయం ఒక కప్పు కాఫీ కాఫీ గ్లాసు నిండా వుండేలా నా భార్య శశికళ చేసే కాఫీ ఇష్టపడేది. మధ్యాహ్నం భోజనం పట్టెడంటే పట్టెడు అన్నం ఆకులో పెట్టుకుంటే పచ్చడి, పప్పు చారు, మజ్జిగ అన్నిటికీ అదే సరిపోయేది. బలవంతపెట్టినా రాత్రికి ఏమీ తీసుకునేది కాదు. ఈరోజు మధ్యాహ్నం భోజనం చేస్తే... మళ్ళీ రేపు మధ్యాహ్నం వరకు అలాగే వుండేది. మామిడిపండ్ల సీజనులో మామిడిపళ్ళు తిని అన్నం తగ్గించుకునేది. తరువాత కాలంలో వంటా వార్పూ చేయటం చేతకాక ఆయాసం ఎక్కువైనరోజుల్లో అడిగినవాళ్లకు అడగనివాళ్లకు దీపారాధన కొరకు వత్తులు చేసి ఇచ్చేది. స్కూల్లో పిల్లలకు చెబితే దండిగా 'పత్తి' తెచ్చి ఇచ్చేవారు. స్నానం ముగించుకుని వత్తులు చేస్తూ కూర్చునేది. లక్షల వత్తులు చేసి వుంచేది.

అడిగితే మాత్రం సలహా ఇచ్చేది. అడగకపోతే మౌనంగా వుండేది. తమ పిల్లల ఆదాయాల్లో వ్యత్యాసాలున్నా ఏనాడూ వారిది వీరికిమ్మని, వీరిది వారికిమ్మని అడిగేది కాదు.

మా మిత్రుడొకడు అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్ళేవాడు. జీవితంలో బాగా దెబ్బతిన్నవాడు. నలుగురు ఆడపిల్లలకు తండ్రీ...

(ఇంకా వుంది)




# క్రాస్ వర్డ్ పజిల్స్ - కథా కమా మీషు -2



## చాగంటి కృష్ణకుమారి

ప్రామాణికమైన క్రాస్ వర్డ్ పజిల్ ఒక చదరం లో నిలువుగానూ అడ్డుగానూ గీతలు గీయాగా ఏర్పడే చిన్ని చదరపుగడులతో నింపుతారు. వీటిలో కొన్ని చదరపు గడులు తెలుపువీ కొన్ని నలుపువీ కాగా ఒకనొక నిలువు వరసలోనూ అడ్డువరసలోనూ వున్న తెలుపుగడులలో అక్షారలను చేర్చితే అర్ధవంతమైన పదాలవుతాయి. నలుపుని 'రద్దు చేసిన గడి' అని చెప్పులోవచ్చు. ఎందుకంటే ఆగడిలో అక్షరం వుండదు. ఈ నలుపు తెలుపు గడుల అమరిక లో తప్పనిసరిగా నిలువు అడ్డుగడులలోని పదాలతో పంచుకొంటున్న అక్షరాలు వుండాలి. నలుపు తెలుపు గడుల కట్టడానికి ఒక రూపం, ఆరూపానికి భ్రమణ సౌష్టవం ఉండాలి. సాధారణంగా రెండింతల భ్రమణ సౌస్థ వం గల గళ్ల కట్టడాలను వాడడం ఆనవాయితీ. ఉదాహరణకి పటము -3 లో క్రాస్ వర్డ్ పజిల్ ని చూడండి )దీనిని మధ్యకు మడత పెడితే తెలుపు గళ్ల మీదకు తెలుపువీ నళ్లగడులమీదకు నళ్లగడులూ చేరతాయి. దీనిని కుడి ఎడమల సౌష్టవం అంటారు లేదా మీదిక్రిందుల సౌష్టవం అని కూడా అనవచ్చు.



పటము-3


ప్రకృతిలో మనం ఈ విధమైన కుడి ఎడమల సౌష్టవాన్ని సీతాకోక చిలుకలో చూస్తాము (పటము -4)



పటము -4

ఆధారాలను (లేదా సూచనలు) ఇచ్చే టప్పుడు ప్రతీ పదం మొదటి అక్షరం దగ్గర సంఖ్యను ఇవ్వాలి . పదాలను కుడినుంచి ఎడమకు లేదా ఎడమనుంచి కుడికి అలాగే పైనుండి కిందకు లేదా కిందనుండి పైకి చదివే విధాన కూడా పదాలు తెలుపు గడులలో చేర్చవచ్చు. చదరంలో ఇమడ్చకుండా తెరచి వున్న గడులను కలుతూ రూపొందించే పజిల్స్ వేరే కోవకి చెందుతాయి. ఈ వ్యాసం లో మనం చెప్పుకొంటున్నవి ఒకానొక చదరపు చట్రం (grid) లో ఒదిగిన గళ్ళ కట్టు. ఇవి చతురస్రాకారంలోకానీ లేదా దీర్ఘ చతురస్రాకారంలో కూడా వుండవచ్చు. సాధారణం గాచతురస్రాన్నే వాడడం ఆనవాయితీ.

ఇంగ్లీషు పత్రికలైన The Hindu, Economic Times , బ్రిటిష్ పత్రికలు 15 / 15 గళ్ళ కట్టును వాడుతాయి . పటం 5 లో కట్టు బ్రిటిష్ వారు వాడిన ఒకానొక క్రాస్ వర్డ్ పజిల్ నిర్మాణాన్ని చూడ.వచ్చు



పటము -5

## ఆగస్టు సంచిక గడి - నుడి సమాధానాలు

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| య్య | ష్ణ | కృ | ల | పా | గో | ల | రా | గ్గి | దు | | లు | మా | ధ్య | ఉ |
| | | తా | | | కు | | జ | | ర్వ్యా | | | ర్గ | | దా |
| | | రా | | చా | లా | ఈ | గో | వు | పా | లు | | ద | | త్త |
| భి | అ | షే | కం | | ష్ఠ | | పా | | ర | | ద | ర్శ | న | ము |
| | | ట్టా | | | కు | | మి | | లా | | | ము | కు | |
| ప | ల్నా | డు | సీ | మ | | వే | చా | ను | | దా | కా | డు | ప్పు | అ |
| | | | | ల్లె | వ | | రి | | | ఖ | | | | య్యం |
| రా | న | డే | ర | మా | బా | యి | | చు | డు | లా | ల | కి | ల | కి |
| | | | | ల | | | రు | | కు | చా | | | | వెం |
| భో | గ | ము | ల | తో | | వీ | చే | ను | | లు | క | లు | లు | క |
| | | ర | | | డు | | నూ | | లు | | | వు | | ట |
| ము | దు | స | లి | | హు | | చు | | కు | | ఆ | కు | కూ | ర |
| త్వ | | కే | | ఎ | వ | ర | ను | కొం | టా | రు | | వా | | మ |
| ర | | గ | | | ర్తా | | ల | | రిం | | | క | | ణ |
| వీ | ర | నా | రి | | వా | వి | లా | ల | గో | పా | ల | కృ | ష్ణ | య్య |

# "ఆధ్యాత్మిక సాహితీ వేత్త,అధునాతన ఆర్ష కవిఆచార్య మసన చెన్నప్ప"



తుమ్మూరి రాం మోహనరావు


కొందరి గురించి కొన్ని మాటల్లో చెప్ప వచ్చు. కాని మసన చెన్నప్ప గారి వంటి విశిష్ట వ్యక్తుల్ని పరిచయం చెయ్యాలంటే కష్టమైన పని.ఎక్కడ మొదలు పెట్టాలి ఏ విషయం ముందుచెప్పాలి అనే ప్రశ్నలు ఉద్భవిస్తాయి. పూర్వజన్మసుకృతం లేనిదే బ్రహ్మవిద్య అలవడటం కష్టం. అందునా ఒక వెనుకబడిన వర్గానికి చెందిన మగ్గంమీద బట్టలునేసుకునే పద్మశాలి వంశంలో జన్మించిన చెన్నప్పగారు వేదవిద్యనభ్యసించటం దానిని మనసా వాచాకర్మణా అవలంబించటం నిజంగా వారి పూర్వ జన్మల పుణ్య ఫలమే.

"దేన్నయినా హేతుబద్ధంగా ఆలోచించి, సత్యాన్ని అతిక్రమించకుండా, స్వార్థానికి తావు లేని విశ్వమానవ కల్యాణ దృష్టిని అలవరచుకోవడమే ప్రగతిశీల మానవతాదృక్పథం" అని నిర్వచించగలగడం లో వారి అధ్యయన గాఢత,పరిశోధనాపటిమ,సాహితీ గరిమ తెలియవస్తాయి.

ఇది వీరి అకడమిక్ విద్యార్హతకు సంబంధించింది.కాని పండిత గోపదేవ శాస్త్రి గారిశుశ్రూష చేసి ఏడాది పాటు రోజుకు ఆరుగంటల పాటు వేదాధ్యయనం చేసివేదాలు,షడ్దర్శనాలు నేర్చుకున్నారు. అందుకే మసన చెన్నప్పగారికి ఆర్ష విద్యల పై అంతపట్టు దొరికింది.

జన్మనా జాయతే శూద్రః అన్న శ్లోకాన్ననుసరించి వారిప్పుడు ద్విజులే కపిలముని కృత సాంఖ్యదర్శనాన్ని ప్రకృతి పురుష వివేకంగా తెనిగించి తనకుసాంఖ్యము పై గల మక్కువకు తల్లి

'కపిలముని గోత్రమ్ము నాదని
అమ్మానాన్నలు చెప్పవింటిని
సాంఖ్యదర్శనమందు మక్కువ
గౌరవమ్మును కలిగియుంటిని'




ఇందులోనే తనకు ఆర్షవిద్యా గురుపైన గోపదేవుని కూడా వినమ్రంగా స్మరించుకున్నారు


'దేవదేవుడు నాకొసంగిన
దేహమును కాపాడుకొందును
గోపదేవుని పదములంటుచు
దాహమును చల్లార్చుకుందును'

తాను నేర్చుకున్నవి పదిమందికి తెలుపాలనే తపన గలిగిన వ్యక్తి గనుకనే గురజాడ ముత్యాల సరాలకు జీవం పోసి ఈశావాస్యం, శుకోపనిషత్తులవంటివి తెలుగు ఆధ్యాత్మిక పాఠకులకోసం అనువదించారు.

ఈశావాస్యములోని కొన్ని శ్లోకాలకు వారి అనువాదం ఎంత కమనీయమో చూడండి.

'సకల లోక వ్యాపకుండై
సర్వశక్తి సమన్వితుండై
దేహములు లేనట్టివాడై
దేవదేవుండలరుచుండును'

కేవలము దేహమును గూర్చిన
జ్ఞానమొక్కటివముక్తినీయదు
ఆత్మసాక్షాత్కారమొక్కటె
మోక్షమును సాధించి పెట్టును




ఇలా పామరులకు కూడా అర్థమయ్యేంత సులభ శైలిలో ఉపనిషత్సుధలను పంచారుచెన్నప్పగారు.

ఈనాడు దిన పత్రిక అంతర్యామి శీర్షికకై అనేక వ్యాసాలు రాశారు.అలాగే నమస్తే తెలంగాణ 'చింతన ' కు గూడా ఆధ్యాత్మిక వ్యాసాలు రాసారు రాస్తున్నారు.

కేవలం ఆధ్యాత్మిక రంగంలోనే కాకుండా పలు ఇతర రచనలు కూడవీరి కలం నుంచిఎన్నో జాలువారాయి. వాటి వైపు కూడా తొంగిచూద్దాం మరి దానికంటేముందు వారి జీవిత విశేషాలు కొన్ని తెలుసుకుందాం. మనన చెన్నప్పగారు పాలమూరు జిల్లా కొలుకులపల్లి గ్రామంలో పుణ్యదంపతులుమనన బుచ్చయ్యరామలక్ష్మమ్మ దంపతులకు చివరి సంతానంగా దివి జయనామ సంవత్సరమాఘబహుళ విదియ నాడుఅనగాఆంగ్ల మానం లో 8-2-1955 నాడు జన్మించారు. సింహరాశిజాతకులు గనుక సూర్యుడు అధిపతి కాబట్టి ఆ తేజం వీరికి జన్మఫలం.


వీరి తొలి రచన 'మల్లి పదాలు' మాత్రాచ్ఛందస్సులో వెలువరించి గురువులు గుండేరావుహర్కారే గారికి అంకితం చేశారు.

'వగరు చిగురులు మేసి
వలపు రాగము తీసి
ప్రజల తత్త్వము తెలిసి
పాడవే మల్లీ'-




అంటూ పాఠకుల హృదయాలను కదిలించే ఆవేశపూరిత అనుభూతులను మల్లి పదాలలో మలిచారు మసన చెన్నప్పగారు.వీరి గ్రంథాలు అన్నీ పర్యావలోకిస్తే మళ్లీ అది ఒకగ్రంథము అవుతుంది గనుక స్థాలీ పులాక న్యాయంగా కొన్ని మాత్రమే ప్రస్తావిస్తాను. 'నేత్రోదయం' అనే కవితా సంపుటిలోని ఒక కవితతో-

'నేలమీది నన్ను-దివ్యలోకాలు
చూడరమ్మని-ఇంద్రుడు పంపిన
-శ్వేతాశ్వం వెన్నెల-సజ్జరొట్టెకు
పూసిన వెన్న వెన్నెల-ఆకాశం
నిండా పూచిన మల్లి వెన్నెల




అంటూ భావవిహారంచేస్తారీయన లోని కవి. అలాగే 'అమృత స్వరాలు' ఉపనిషత్సూక్తి సుధ కాగా,అగ్ని స్వరాలు' సందేశాత్మకం.

'అమ్మ భారతి అడుగుచున్నది
వీరరస కావ్యమ్ములేవని'
-'నిదురవోయిన జాతినెవ్వడు
తట్టిలేపునొ పట్టిలేపునొ'





వంటి వాక్యాలు చైతన్య పూరితాలు. అమెరికా సందర్శనానంతరం అక్కడి స్థితిగతులను - 'అమెరికా!అమెరికా!' అని నానీలలోవెలువరించారు. మచ్చుకు ఒక నానీ-

'అమెరికా ఎంత గొప్పది
ఎవరి జోలి వాళ్లది
ఎవరి జోలె వాళ్లది'

అమెరికా నానీలే గాక అమెరికా ముచ్చట్లు,నయాగరా వంటివి అక్కడిసందర్శనానుభవాలు పుస్తకా-లుగా వెలువడ్డాయి.అలాగే వీరి 'ప్రమీలా త్రిశతి' స్మృతి కావ్యం ,అర్ధాంగి ఆకస్మిక మరణానంతరం-ఆవేదనలోనుండి పొంగి వచ్చిన నలభై ఏళ్లు దాంపత్య జీవన సౌరభాల నెమరు.

'రాణివా? కాదు మద్గృహ రాజ్ఞివీవు
ఇంతివా?కావు నా నేత్రకాంతివీవు'

అంటూ ఇల్లాలిని దీప్తం చేస్తారు. ఇటీవలనే వీరు శ్రీరామ కథాగేయం, మాతృగీతలను వెలువరిం-చడం జరిగింది. ఇక వీరి సన్మాన సత్కారాల గురించి రాయాలంటే కూడా కష్టమే.ఒకటో రెండో అయితేవి-వరించవచ్చు.కాని




స్వగృహే పూజ్యతే పితరః
స్వగ్రామే పూజ్యతే ప్రభుః
స్వదేశే పూజ్యతే రాజా
విద్వాన్ సర్వత్ర పూజ్యతే

అన్నట్లు ఈ విద్వన్మణి ఇరు తెలుగు రాష్ట్రాల్లోనే గాక ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో విదేశాల్లో పలుసత్కారాలను పొందారు. తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారం,తెలంగాణా ప్రభుత్వ ఉత్తమ అధ్యాపకపురస్కారం, మహారాష్ట్ర లోని పుణేనగరంలోని ఆంధ్ర సంఘం వారిచేవిశిష్టకవిగా"భావితరాలకు మార్గదర్శి" గా సత్కరింపబడటం వీరి కీర్తి కిరీటంలో కొన్ని కలికి తురాయిలు.
ఒక ఆధ్యాత్మిక వేత్త,అనవరతాధ్యయన,అధ్యాపన శీలుడు,నమ్మిన సిద్ధాంతాలనుతు.చ.తప్పకుండా పాటిస్తూ మా-నవతావాదిగా అన్నిటి కంటే అరమరికలు లేనిఆత్మీయులుగా ఉన్నవిశిష్ట కవివరేణ్యులు ఆచార్య మసన చెన్నప్ప గారి గురించి ఎంత చెప్పినా తక్కువే.

మసలే ఆలోచనలన్ని మలిచిన కావ్యాలుగా ,అనుభవాలన్నీ అద్భుతప్రసంగాలుగా,నేర్చినదంతా తీర్చిన జీవి-తాచరణగా మసన చెన్నప్పగారు మనకాలపు ఋషి యనడంలో సందేహంలేదు.

# మన తెలుగు సామెతలు

(జులై నెల సంచిక తరువాయి)

భారతీ శర్మ



తమాషాగా మన పెద్దలు సందర్భానుసారంగా మనల్ని హెచ్చరిస్తూ ప్రోత్సహిస్తూ వాడే నానుడి వాక్యాలే సామెతలు.

కొన్ని సామెతలు చాలా గమ్మత్తుగా ఉంటాయి. సరదాగా కూడా ఉంటాయి. వాటిలో నిగూఢార్థం, జీవిత సత్యాలు ఉంటాయి. విడమరచి విశదీకరించి చెప్పకుండానే ఈ సామెతల్ని ప్రయోగించి మనకి చక్కని పరిజ్ఞానాన్ని సందర్భానుసారంగా అందించేవారు మన పెద్దలు . మన తెలుగు భాషా గొప్పతనాన్ని ఎంత పొగిడినా తక్కువే. మన సామెతలు, సూక్తులు, పొడుపు కథలు నేటి తరానికి అందాలనే మా చిరు ప్రయత్నమే ఈ సామెతల శీర్షిక. జులై సంచికలో కొన్ని సామెతలు చూసాం కదా. ఈసారి మరికొన్ని తెలుసుకుందాం.మరి మనం సామెతల్లోకి వెళ్ళిపోదామా?

41. ఇంట్లో పిల్లి వీధిలో పులి
42. ఇల్లు ఇరకటం ఆలు మరకటం
43. ఇల్లు కట్టి చూడు పెళ్లి చేసి చూడు
44. ఇసుక తక్కెడ పేడ తక్కెడ
45. ఈనగాచి నక్కల పాలు చేసినట్లు
46. ఈ వూరికి ఆ వూరు ఎంత దూరమో ఆ వూరికి ఈ వూరు అంతే దూరం
47. ఉట్టి కట్టుకు ఊరేగుతారా
48. ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరినట్లు
49. ఉన్నమాటంటే ఉలుకెక్కువ
50. ఉపకారానికి పోతే అపకారం ఎదురైనట్లు
51. ఊరు పొమ్మంటుంది కాడు రమ్మంటుంది
52. ఉలి దెబ్బ తిన్న శిలే శిల్పం అయినట్లు
53. ఊరికే వస్తే మావాడు మరొకడు ఉన్నాడన్నట్టు
54. ఎంచబోతే మంచమంతా కంతలే
55. ఎంతవారయినా కాంత దాసులే
56. ఎందుకురా ఒగర్పు అంటే ఎల్లుండి సంతకు పోవాలిగదా అన్నాట్ట
57. ఎక్కడైనా బావ కానీ వంగతోట కాడ మాత్రం కాదు

58. ఎండ కాచిన చోటే వెన్నెల కాచేది

59. పిల్లికి ఎలుక  సాక్ష్యం చెప్పినట్లు

60. ఎనుబోతు మీద వాన కురిసినట్లు

61. ఎవరు తీసిన గోతిలో వారే పడతారు

62. ఎద్దు పుండు కాకికి ముద్దు

63. ఎర చూపి చేపను లాగినట్లు

64. ఎవరికి వారే యమునా తీరే

65. ఎవరి పిచ్చి వారికానందం

66. ఏకు అయి వచ్చి మేకయినట్లు

67. ఏ గూటి చిలుక ఆ గూటి పలుకే పలుకుతుంది

68. ఏ పుట్టలో ఏ పాముందో

69. ఏమీ లేని విస్తరి ఎగిరి ఎగిరి పడుతుంది అన్నీ ఉన్న విస్తరి అణగి మణగి ఉంటుంది

70. ఏరు దాటిన తరువాత తెప్ప తగలేసినట్లు

71. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడతాయా

72. ఓడలు బండ్లగును బళ్ళు ఓడలగును

73. కామెర్ల రోగికి లోకమంతా పచ్చనే

74. కంచే చేను మేసినట్లు

75. కత్తి మీద సాము

76. కాకి ముక్కుకు దొండపండు

77. కాకి బిడ్డ కాకికి ముద్దు

78. కాగల కార్యం గంధర్వులే తీర్చారు

79. కాచే చెట్టుకే రాళ్ళ దెబ్బలు

80. కుక్క కాటుకు చెప్పు దెబ్బ

81. కుక్క తోక పట్టుకుని గోదారీదినట్లు

82. కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడగొట్టినట్టు


83. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టు

84. కొబ్బరిచెట్టు ఎందుకెక్కువయ్యా అంటే దూడ మేత కోసం అన్నాట్ట

85. కొత్త ఒక వింత పాత ఒక రోత

ఇవండీ కొన్ని సామెతలు. చాలా బావున్నాయి కదా! వచ్చే సంచికలో ఇంకా బోలెడు సామెతలు తెలుసు-కుందాం. మరి ఉంటాను, మీ...... భారతీ శర్మ









bye from Oz

RNI No. TELTEL/2011/39497 SEPTEMBER 2021 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st September Date of Posting:8th September












Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.